# ఐక్య ఉపాధ్యాయ

UTF

సంపుటి 3 ★ సంచిక 10 అక్టోబరు, 1977





## జంతర్ మంతర్

జంతరు మంతరు-పెట్టెను చూడు
విద్యాశాఖ-వరవడి చూడు
తిక్కతిన్నగా-కుదిరెను చూడు
—'నిరుడూ డెబ్భై-ఈ యేడు
యెనభై
పెరక్కపోతే-పిలకలు కోస్తా!
ఇంక్రిమెంట్లనూ-కట్ చేసేస్తా!
పనిష్మెంటుకూ-గురిచేసేస్తా!'
—'పంతులొక్కడికి-ఏభైమంది
రిక్రూటయినా-ఫరవాలేదు!
చదువులెందుకు-గెదువులెంద
చట్ పట్ చట్ పట్-చట
పట చట్ పట్
—'ఎనభైమందికి-ఒకటే సెక్షన్
ఏ పాట్లయినా-ఎన్ని తూట్లయిన
నోరు తెరిస్తే-డొక్క చించుతా!
గోలపెట్టితే-డోలు కట్టుతా!
ధాం... థూం... ధాం... థూం-
తకధిమి తకధిమి
తధాంకు తకధిమి- తద్దణ
తకధిమి


రు. 1

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ... అధికార పత్రి

*The Largest Circulated Telug ... Monthly*

## పాఠకుల అభిప్రాయాలు

అద్వితీయంగా జరిగిన ఖమ్మం మహాసభలు అందరిలోను చైతన్యం రగుల్కొల్పాయి. ఆనందం అర్ణవమై అనుభూతులు చేతనాత్రై ఎదఎదలో పదం పాడాయి. దానికి ప్రతిబింబంగా ఉంది మహాసభల సంచిక.

—కూరపాటి శేషంరాజు, మాధాపురం.

సంఘంలో ఉపాధ్యాయుల స్థానాన్ని, గౌరవాన్ని స్పష్టతం చేయటంలో పత్రిక నిర్విరామకృషి చేస్తున్నందుకు కృతజ్ఞతలు. —యం.సి. కనకయ్య, కొత్తపేట.

ఖమ్మంసభలకు వచ్చిచూచిన విషయాలన్నింటిని మరొక్క మారు మా ముందుంచటం వలన ఆ సంచిక తీసినప్పుడల్లా ఆ అనుభూతికి లోనౌతున్నాము.

—యస్. బురాన్ సాహెబ్ ఇర్రిపాక.

మహాసభల్ని దిగ్విజయం చేయటానికి తీవ్రకృషి చేసిన ఖమ్మం జిల్లా కార్యకర్తల ఫోటోలుకూడా ఉంటే సభల సంచిక సర్వ సంపూర్ణంగా ఉండేది.

—యస్. కొండలరావు ఉప్పుకూరు.

## సంపాదక లేఖలు

### 5 వ తరగతికి జిల్లా లెవెల్ కామన్ పరీక్షలు?

1977 ఆగస్టు 21న విద్యాశాఖామాత్యుల అధ్యక్షతన జరి[గిన] విద్యాశాఖాధికారుల సమావేశంలో ఈ సంవత్సరం 5వ [తర]గతికి జిల్లా లెవెల్ కామన్ పరీక్షలు జరపాలని నిర్ణయించటం జరిగింది. కేవలం హాజరుమీద ఆధారపడిన ప్రమోషన్లు, అర్హు[ల]ైన విద్యార్థుల్ని పై తరగతులకు పంపేఅధికారం తరగతి ఉపా[ధ్యా]యునికి లేకపోవటంవలన విద్యాస్థాయి ఎలా క్షీణిస్తున్నదో అధికారులకు తెలియనిదికాదు. కాన యీ క్రింది చర్యలు ముందుగా తీసుకొని ఆ తర్వాత కామన్‌పరీక్షలు జరిపిన సత్ఫలితాలుండగలవని నా అభిప్రాయం.

1) ప్రమోట్ చేసే అధికారం క్లాస్ టీచర్లకు ఇవ్వాలి. [2) పా]ఠశాలవసతి, ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తిని, పాఠ్య[పుస్త]కాల సప్లయి ముందు సరిజేయాలి. 3) ఏకోపాధ్యాయ పాఠ[శాల]ల్ని రద్దుచేయాలి 4) సిలబస్ భారం తగ్గించాలి 5) త్రిభాషా [సూ]త్రాన్ని ఎత్తివేయాలి 6) కొన్ని పాఠ్యగ్రంధాలు ఉదాహర[ణకు] సాంఘికశాస్త్రం విపరీతంగా పెంచబడింది — ఈ పరిస్థితి [మారకుం]డకుండా కామన్ పరీక్షలు నిర[్వహి]ంచటం విద్యాస్థాయి [పెంచ]టానికి ఏ విధంగాను ఉపయో[గపడ]ని విన్యాసం చేస్తు...

[...] వెంకటేశ్వర్లు, ప్రా[...] [...]టి.యఫ్ శాఖ

### ఆర్. సి. యం. మేనేజిమెంట్ల అక్రమాలకు విద్యాశాఖాధికారుల ఉదాసీనతకు అంతం లేదా?

గుంటూరు జిల్లా రెంటచింతల, సెంట్ జోసఫ్ హైస్కూలు హెడ్మాస్టర్ కరస్పాండెంటు అయిన శ్రీ కె. సత్యానందం తన స్కూలులో 6 సం॥లు సర్వీసు కలిగిన టీచర్ శ్రీ యం. రామకోటయ్యను అక్రమఆరోపణలతో గతసంవత్సరం తొలగించారు. డి.ఇ.ఓ. గారు ఆర్డరిచ్చినా నేటివరకు ఆ ఉపాధ్యాయుని ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం దారుణం. సర్టిఫికెట్లు ఇస్తామని ఆ టీచరును 31-8-77న ఆ స్కూలుకు రప్పించి మళ్ళీ ట్రూ కాపీలపై గజిటెడ్ ఆఫీసరు సంతకాలు కావాలని వంక జెప్పి సర్టిఫికెట్లనీయ నిరాకరించారు. ఈవిషయం డి. ఇ. ఓ. గార్కి ఫిర్యాదు జేయుటం జరిగింది

అలాగే సదరు టీచరు సోదరుడు శ్రీ యం. వీరయ్య గారిని, శ్రీయం రామయ్య గారిని సత్తెనపల్లితాలూకా అత్తలూరు ఆర్.సి.యం యు.పి. స్కూలునుండి కరస్పాండెంట్ శ్రీ యస్. మరియదాసు ఏవో సాకులతో డ్యూటీలో లేకుండాచేసి గత నాల్గు సంవత్సరాలనుండి వార్కి జీతాలులేని దారుణ పరిస్థితి కల్పించారు. ఇదేస్కూల్లో పనిచేస్తున్న శ్రీ టి.హనుమంతరావు, శ్రీ యం. వి. శేషగిరిరావు గార్లకు కక్షాచర్యగా ఇంతవరకు మెరిట్ స్కేలు పేఫిక్సేషన్ జరుపలేదు. ఇంక్రిమెంట్లు మంజూరు 69 డిశంబరు నెలజీతాలు ఎవ్వరికీ ఇవ్వలేదు.

ఈ మేనేజిమెంటువారు ఉపాధ్యాయుల బదిలీలు, సీనియారిటీ విషయాలలోకూడ ప్రభుత్వ ఉత్తర్వుల్ని పాటించటం లేదు. భార్యాభర్తల్ని చీల్చి బదిలీలకు గురిచేశారు. సి డి. మొత్తి వాయిదా ఇంతవరకు ఇవ్వలేదు, అనేకచోట్ల ఈ మేనేజిమెంటుకింద టీచర్లు పలు అవస్థలకు గురిఅవుతున్నారు. విద్యాశాఖాధి కారులకు ఎన్ని విన్నపాలు చేసినా అ లక్ష్యం, ఉదాసీనత ప్రదర్శిస్తున్నారు. పరిస్థితి తీవ్రంగాకముందే ఇప్పటికైనా విద్యాశాఖ ప్రత్యేకాధికారిని నియమించి విచారణ జరిపించాలని ఈ సందర్భంలో డిమాండ్ చేస్తున్నాం.

సర్వ మానవసేవ, నైతిక ధర్మాలు వల్లించే ఈ మేనేజిమెంట్లు కంచే చేను మేసినట్లుగా ఈ విధంగా టీచర్లను బాధపెట్టడం, ఘోరం. కాన విద్యాశాఖ వెంటనేకదిలి సత్వరచర్యలు తీసుకొని టీచర్లకు వృత్తి భద్రత, సంక్షేమం కాపాడాలని కోరుతున్నాను. టి. అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి

గుంటూరు జిల్లా యు టి.యఫ్. శాఖ.

### మళ్ళీ వివక్షా?

రాష్ట్ర ప్రభుత్వం జి ఓ. నెం 928 తేది 10-9-77 ద్వారా ఉన్నతార్హతలుగల కొన్ని కేటగిరీల టీచర్లకు మాత్రమే అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చింది. గ్రేడ్ II పండితులకు, స్పెషల్ గ్రేడ్ యస్.జి బి టి. లకు, గ్రేడ్ I స్కూలు అసిస్టెంట్స్‌కు, ఆర్ట్స్ & క్రాఫ్ట్ టీచర్లకు దాన్ని వర్తింపజేయక మళ్ళీ వివక్ష చూపటం పరమఅన్యాయం. కాన ఉన్నతార్హతలు సంపాదించుకొని స్థాయి పెంచుకొన్న అన్ని కేటగిరీల టీచర్లకు దానినివర్తింపజేసి ప్రోత్సహింపవలసిందిగా కోరుతున్నాను. పి యల్. మోహన్, యమ్.ఏ నిజామాబాద్.

IUVOIA130

IKYA UPADHYAYA

Life Subscription 116-00
Yearly „ 10-00
Single Copy 1-00

Ikya Upadhyaya
Akulavari Street,
Vijayawada-2

# ఐక్య ఉపాధ్యాయ

సంపాదక వర్గం :
మైనేని వెంకటరత్నం
(ప్రధాన సంపాదకుడు)
నాదెళ్ళ సీతారామాచారి
కోడూరు నారాయణరావు
అప్పారి వెంకటస్వామి
మోతుకూరు నరహరి

సంపుటి 3 అక్టోబరు 1977 సంచిక 10

# విద్యారంగంతో చెలగాటం

పిచ్చి తుగ్లక్ బ్రతికేఉంటే 'వీళ్ళకంటె నేనే నయం!' అని తప్పక తృప్తిపడి వుండేవాడు ... విద్యాశాఖాధికారులు జారీచేస్తున్న ఉత్తర్వులు చూసి.

ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 1:50 గా పెంచుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీచేసిన జి. ఓ. యం.యస్ నెం 812 ఉత్తర్వు సరిగ్గా దీన్నే రుజువుచేస్తున్నది.

అంతటితో ఆగెరా?

'సెకండరీ స్కూళ్ళలో సెక్షన్కు 65 మంది దాకాచేర్చుకోవాల'ని ఇంకో పిచ్చి ఫరమానా.

ఆ పైన పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో గత సంవత్సరంకంటె మిన్నగా రాకపోతే 'శిక్షణా చర్యలు తీసుకొంటాము'ని టార్గెట్లు నిర్ణయిస్తూ మతిమాలిన హుకుంలు !

విచిత్రమేమిటంటే... ఇవన్నీ విద్యాస్థాయి పెంచటానికి సుదీర్ఘంగా ఆలోచించి తీసుకొన్న పటిష్ఠ చర్యలట !

* * * *

విద్యాస్థాయిలో గుణాత్మకమైన మార్పులు తీసుకురావాలన్నా వ్యక్తిగత శ్రద్ధ చూపాలన్నా ప్రాథమిక పాఠశాలల్లో 1:20 గా సెకండరీ స్కూళ్ళలో 1:30 గా ఏజన్సీ పాఠశాలల్లో 1:10 గా ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి ఉండాలని దశాబ్దాల తరబడిగా ఉపాధ్యాయులు తమసంఘాలద్వారా తమ అనుభవపూర్వక పరిస్థితిని ప్రభుత్వ దృష్టికి తెచ్చినా, మొన్న మొన్న జరిగిన ఖమ్మం మహాసభల్లో వేలాది ప్రతినిధులు గొంతెత్తి అరచినా విద్యాశాఖ విన్పించుకోకుండా పై జి. ఓ. జారీ చేసింది.

గత వత్సరం ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలల్లో 1:40 పెంచినపుడు జె.సి.టి.ఎ. ద్వారా ఉపాధ్యాయ లోకం ప్రతిఘటించిన అనుభవం కూడా ప్రభుత్వానికి ఉంది.

ఒక ఉపాధ్యాయుడు ప్రాథమిక పాఠశాలలలో పదిమంది పిల్లలకు మించి చదువు చెప్పటం సాధ్యంగాదని విద్యావేత్తలు ఒకవైపు ఉద్ఘాటిస్తూ ఉండగా, తమిళనాడు మొదలగు రాష్ట్రాల్లో 1:20 గా ఇతర వర్ధమాన దేశాల్లో 1:10 గా అమలుపరిచి ఆచరణలో మంచి ఫలితాలు పొందుతుండగా ఆ గుణపాఠాలు తీసుకోకుండా, అనుభవాలు గ్రహించకుండా విద్యాశాఖ ఈ నిర్ణయాలు తీసుకోవడం నిజంగా మతిమాలిన చర్యే.

దీనివలనవిద్యాభివృద్ధికి ప్రబలాటంకంకలగటమేకాకుండా రిట్రెంచ్మెంట్కు దారితీసి ఉన్న ఉద్యోగాలు ఊడే ప్రమాదముంది.

ఓ ప్రక్క విద్యా స్థాయి పెంచాలంటూ ... ఉద్యోగకల్పన చేయాలంటూ వేదికలపై గంభీరోపన్యాసాలు... మరో ప్రక్క వాటికి గొడ్డలి పెట్టుగా దారుణ నిర్ణయాలు ... సంక్షోభంలో ముంచే జీ.ఓ.లు

ఇది ఇలా ఉంటే సెకండరీ స్కూళ్ళలో యింకో పిచ్చి ఉత్తర్వు.

## సంపాదకీయం

ప్రభుత్వ ఫరమానాల మేరకు జిల్లావిద్యాశాఖాధికారులు ప్రతిసెక్షన్లో 65 మంది వుండాలని ఆదేశాలు జారీచేశారు.

ఇది యింతవరకువున్న ఉత్తర్వుకు భిన్నంగా, ఉపాధ్యాయలోకాన్ని ఉక్కిరి బిక్కిరి చేసేదిగావుంది.

ఇదివరలో 55+1=56 విద్యార్థులున్న రెండు సెక్షన్లుగా విభజించేవారు. ఆ తర్వాత 60+1=61 మంది వుంటే మరో సెక్షన్ చేసేవారు. ఇపుడు మళ్ళీపెరిగి ఆ సంఖ్య 65గా మారింది. (అది గుంటూరు జిల్లాలో 72దాకా దేకింది.)

పోనీ 66మంది... ఆ పైన విద్యార్థులున్నా అదనపు సెక్షన్లు ఇస్తారా అంటే వాటిపైనా నిషేధం. చాలా పాఠశాలల్లో 80 మంది 90 మంది ఒకేసెక్షన్గా, ప్రభుత్వ పర్మిషన్ రాక తొడతొక్కిడిగా వున్న స్థితిలో ఉపాధ్యాయులు పాఠాల్ని బోధించాల్సి వస్తున్నది.

ఈ దుస్థితికి తోడు మళ్ళీ టార్గెట్లు ఫిక్సేషన్ ... ఇంక్రిమెంట్లు కట్ చేస్తామనీ ... శిక్షణా చర్యలు తీసుకొంటామనీ బెదిరింపులు.

ఇది ఎక్కడికి దారితీస్తుందో ... ఇంగిత జ్ఞానం ఉన్న వాళ్ళెవరికైనా అర్థమౌతుంది.

ఇటువంటి విధానాల్నే మహారాష్ట్ర, పంజాబ్, రాష్ట్రాలలోగడ అమలుపరచి, అవినీతిపెరిగి, దుష్ఫలితాలు ఎదురై ఉప

# వార్తా ప్రపంచం

## రిటైర్‌మెంట్‌కు 60 ఏండ్ల పరిమితికి హైకోర్టు తీర్పు

ఎయిడెడ్ స్కూళ్ళలో టీచర్ల రిటైర్‌మెంట్‌కు వయో పరిమితి 60 సం॥ల వరకు కంటిన్యూ చేయాలని ఆంధ్రప్రదేశ్ ట్రిబ్యునల్ హైకోర్టువారు 26-1-77 న టి ఆర్, డబ్ల్యు పి 1442 ఇ/1443/ 1976 నెంబరులో తీర్పు ఇచ్చారు.

## రిటైర్‌మెంట్ వయసును 55 ఏండ్లకు తగ్గిస్తూ ఇచ్చిన రాష్ట్రప్రభుత్వ ఉత్తర్వు చెల్లదు

రాష్ట్రంలోని ఎయిడెడ్ కళాశాలలో పనిచేసే ఉపాధ్యాయుల పదవీకాలాన్ని 60 సం.ల నుంచి 55 సంవత్సరాలకు తగ్గిస్తూ గత మే 28 న ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వు చెల్లదని 77 సెప్టెంబరు 15 న హైకోర్టు తీర్పు చెప్పింది.

## పింఛన్ 10 శాతం పెంచటానికి ప్రభుత్వ నిర్ణయం

77 అక్టోబరు నుండి ప్రభుత్వం పింఛనుదారులకు తాత్కాలిక సహాయంగా పింఛనులో 10 శాతాన్ని పెంచుతున్నట్లుగా ముఖ్యమంత్రి సెప్టెంబరు 20 న విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సహాయం పది రూపాయలకు తక్కువ కాకుండా 50 రు.లకు ఎక్కువ కాకుండా ఉంటుందని, దీనితో రాష్ట్ర ప్రభుత్వ పింఛన్ దారులకు కేంద్ర ఉద్యోగులతో సమానంగా పింఛన్ లభిస్తుందని ఆయన అన్నారు.

## టీచర్లకు విడిగా రైల్వే టికెట్ రాయితీలు

విద్యా వ్యాసంగానికి సంబంధించి పర్యటనలుచేసే ఉపాధ్యాయులు ఒక్కరొక్కరుగా పర్యటనలు చేపట్టినా వారికి రైల్వే టిక్కెట్లలో రాయితీలు ఇవ్వాలని రైల్వేశాఖ నిర్ణయించింది. అయితే ఈ రాయితీ పొందదల్చిన ఉపాధ్యాయులు తాము విద్యా వ్యాసంగానికి సంబంధించిన పర్యటనకై వెడుతున్నట్టు తమ జిల్లా విద్యాశాఖాధికారి నుండి సర్టిఫికెట్ దాఖలు చెయ్యాలి. ఇంతవరకు నలుగురు లేదా అంతకుమించి ఉపాధ్యాయులు ఇటువంటి పర్యటనలకు వెళ్ళినపుడే ఈ రాయితీలు లభించేవి.

## పశ్చిమ బెంగాల్ సెకండరీ విద్యాబోర్డు పాలనా నిర్వహణాధికారిగా శ్రీ సత్యప్రియరాయ్ నియామకం

అవకతవకగా నిర్వహింపబడుతున్న పశ్చిమ బెంగాల్ విద్యాబోర్డును రద్దుచేసి మాజీ విద్యామంత్రి, అఖిల బెంగాల్ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షులైన శ్రీ సత్యప్రియరాయ్‌ని దాని పాలనా నిర్వహణాధికారిగా పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం నియమించింది. ఆయన 18మాసాలపాటు ఆపదవిలో వుంటారు. అంతకుముందు 29 మంది సభ్యులతో సెకండరీ విద్యాబోర్డు వుండేది.

*    *    *

అమెరికాలో పిల్లవాడు పుట్టినప్పటి నుండి యూనివర్శిటీలో చదువు ముగిసేవరకు తలిదండ్రుల కయ్యే ఖర్చు 44వేల నుండి 64 వేల డాలర్ల వరకు వుంటుందని ఫ్లారిడా విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ వెల్లడించారు. ఈ ఖర్చు సంపన్నులు సైతంభరించలేనంతగా ఉంటున్నదని ఆయన వ్యాఖ్యానించాడు.

*    *    *

ప్రాథమిక హక్కుల్లో పనిచేసే హక్కు కూడా చేర్చాలని, నిరుద్యోగులకు భృతి ఇవ్వాలని, ఓటు హక్కును 18 సం॥లకు తగ్గించాలని యువజనతా జాతీయ కమిటీ ఆగష్టు 21న భోపాల్‌లో కోరింది. మెట్రిక్ స్థాయిలో ఉద్యోగాలు కల్పించే విద్యను ప్రవేశపెట్టాలనీ, విద్యాసంస్థలను ప్రజాస్వామ్య పద్ధతులలో నడపాలని, 5-14 సం॥లలో పిల్లలకు నిర్బంధోచిత విద్యను అమలు చేయాలని, నిరక్షరాస్యతా నిర్మూలనకు నిర్మాణ యుతంగా కార్యక్రమం చేపట్టాలని, పబ్లిక్ పాఠశాలలు నిషేధించాలని ఆ సమావేశం కోరింది.

*    *    *

ఈనాటి వరకూ వాడుకలో వున్న, ఇటీవల వాడుకలోకి వచ్చిన మాటలన్నిటిని ఒక్కచోటు చేర్చి 'తెలుగుశబ్ద సాగరం' అనే కొత్తనిఘంటువును తయారు చేయాలని తెలుగు అకాడమీ నిశ్చయించింది.

---

సంహరించుకోవటం జరిగింది. ఆ అనుభవాల్ని గ్రహించకుండా విద్యాశాఖాధికారులు విద్యాస్థాయికి . . . పబ్లిక్ పరీక్షా ఫలితాలకి ముడిపెట్టి, టార్గెట్లు నిర్ణయించి క్రమశిక్షణ కొరడాలు ఝళిపించటం జరుగుతున్నది.

ఇవి విద్యాభివృద్ధికి గొడ్డలిపెట్టయిన మతిమాలిన చర్యలు కావా?

అవినీతికి దారితీసే అనాలోచిత విధానాలుకావా?

ఉన్న ఉద్యోగాలు ఊడగొట్టే ఉత్తర్వులుకావా?

— వెంటనే ప్రభుత్వం యీ ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలనీ, అందుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యారంగ శ్రేయోభిలాషులు ఆందోళనద్వారా ప్రభుత్వంకళ్ళు తెరిపించాలని, ఈ ఉన్మాదచర్యల్ని ఉపసంహరించుకునేట్టు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

---


## ఐక్య ఉపాధ్యాయ ప్రకటన రేట్లు

| | |
|---|---|
| 4 వ కవరు పేజీ | రు. 300-00 |
| 2, 3 కవరు పేజీలు (ఒక్కొక్కటి) | రు. 250-00 |
| లోపలి పూర్తి పేజీ | రు. 200-00 |
| లోపలి (అర) ½ పేజీ | రు. 100-00 |
| లోపలి (పావు) ¼ పేజీ | రు. 50-00 |

# కవితలు గేయాలు!

## చిరుద్యోగి

—శ్రీ అడిగోపుల వెంకటరత్నం, గుంటూరు

పిడికెడు పి. యఫ్. ఇచ్చేసి
బెత్తెడు పింఛన్ పారేసి
చచ్చావంటుంది ప్రభుత్వం
పదవీ విరమణైన ప్రభుత్వోద్యోగిని...
ఉద్యోగంలో చిరుద్యోగిని!
ఎదిగిన కూతుళ్ళకు
వరుళ్ళు దొరక్క
చదివిన కొడుకులకు
ఉద్యోగాలు చిక్కక
చదువుతున్న బిడ్డలకు
పుస్తకాలు కొనలేక
తెచ్చినబాకి తీర్చలేక
చనిపోవాలనుకుంటాడు
చనిపోలేని ఆ ఉద్యోగి
మంచంలో భార్య మందు తెమ్మంటుంది
కాదు... తెచ్చిస్తే లేస్తానంటుంది...
లేచి బాధను పంచుకొంటానంటుంది
అతను మందూ తేలేడు
ఆమె బాధా పంచుకోలేదు!
ఆఖరికి తానొక్కడై
ఆవేదనకు లోనై
మోయాల్సిన బరువును
మోస్తూ... మోయలేక
నిక్కుతూ... నీల్గుతూ
నడక సాగిస్తాడు
నడుస్తూ ప్రాణం విడుస్తాడు!

## చైతన్యం

పాత కథ — "రత్నం"

'చిన్నా... చిన్నా... నిన్న బడికెందుకు రాలేదు?'
'అవ్వ బువ్వ పెట్టలేద!'
'అవ్వా... అవ్వా... బువ్వ ఎందుకు పెట్టలేదు?'
'దొర కూలి గింజలివ్వలేదు!'
'దొరా... దొరా కూలిగింజలెందుకివ్వలేదు?'
'బుడ్డాణ్ణి నా దగ్గర జీతానికి పెట్టలేదు!'

కొత్త కథ

'జీతానికి పెట్టలేదని కూలి ఎగేస్తావా?'
'నువ్వెవడివి అడగటానికి... అది నా యిష్టం!'
'వాడు చదువుకొంటే నీదేం పోయింది?'
'ఏం పోయిందా? నా అధికారం పోతుంది!
నా పునాదే కదిలి పోతుంది!
'నీకు ఊడిగానికి రాడని... ఆ బిడ్డ భవిష్యత్తు
పాడుచేస్తావా?'
'ఏమిటి నీ ప్రశ్నలు? ఎవడివసలు నీవు?'
'ఎవడినా... పంతుల్ని! బడిపంతుల్ని! బిడ్డలంతా
చదువు కోవాలనే వాణ్ణి'
'బడిపంతులివా....నిన్ను....నిన్ను...'
'ఊ....నిన్ను?'
'ఇక్కడినుంచి బదిలీ చేయిస్తా!
మువ్వు తిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లుతాగిస్తా!'

'నీ ఉడత ఊపులకి బెదరను. నీ బదిలీ బెదిరింపుకు బెదరను!' చిన్న చదువుకొంటాడు! మనిషిగా బ్రతుకుతాడు! ఇది నిజం....ఇక చెల్లదు నీ హుజం!'

—అగ్గి గుగ్గిలమయ్యాడు భూస్వామి
బెదరకుండా ఎదురు నిల్చాడు చైతన్య స్వామి

# గుసగుసలు

## మింగేది ఒకరు...కక్కేది యింకొకరు
## నల్గొండజిల్లాలో టీచర్లదుస్థితి

నల్గొండ జిల్లాలో పెదవూర, మిర్యాలగూడెం మొదలగు సమితులలో అధికారులు టీచర్లనుండి సి డి. వసూలుచేసిమధ్యలో 7 నెలలపాటు సి డి ఖాతాలో ఆ సొమ్ము జమపెట్టక నిర్లక్ష్యం చేసిన ఫలితంగా ఇప్పుడు ఆ ఎకౌంట్లకుచెందిన బ్యాంక్ వాళ్ళు పెదవూరసమితికి రు. 1050, మిర్యాలగూడెం సమితికిరు.1500లు పెనాలిటీ కట్టవలసిందిగా కోరేరు. దానిపై సమితి అధికారులు ఉపాధ్యాయులనుండి తిరిగి ఆ సొమ్ము వసూలు చేస్తున్నారు. మీరిప్పుడు ఇవ్వకపోతే 1982వరకు సి డి. చేతికి రాదని చెప్తున్నారు. ఇదేమిటి? అని సంఘం తరపున అడిగితే అప్పటి అధికారులు ఇప్పుడులేరు దానికి మేము బాధ్యులంకాము.ఆనష్టాన్ని మీరు భరించాల్సిందే!' అంటున్నారు. ఈ విధంగా అధికారులు చేసిన తప్పుకు ఉపాధ్యాయుల్ని బాధ్యుల్ని చేస్తున్నారు.

ఇది ఇలాఉంటే పెదవూర సమితిలో 1974నుండి జి పి. యఫ్ వసూళ్ళు చేయటంతప్ప ఏ ఖాతాలలో, ఏ నంబరులో జమచేస్తున్నారో టీచర్లకు తెలియదు. ఈ సొమ్ముకూడా కరిమింగిన వెలగపండుఅయిందేమోనని టీచర్లు భయపడుతున్నారు. ఈ అక్రమాలను అరికట్టి ఉపాధ్యాయులకు న్యాయం కలుగజేయ వలసిందిగా కోరుతున్నాం.

# పిలుపు!

(కథానిక)

'రత్నం'

'మీరు ప్రతక లేని బడివంతుళ్ళు గాదు!
బక్కచిక్కిన అయ్యవార్లు కాదు!
సమాజాన్ని జాగృతపరిచె అయ్యవార్లు!
భావి జాతి నిర్మాతలు!
భారతభాగ్య విధాతలు!

— ఉపాధ్యాయ దినం రోజున అనర్గళంగా సాగిన ఊకదంపుడు ఉపన్యాస పాయసం కడుపునిండా జుర్రి, ఆరక్క పుక్కిరిబిక్కిరై... ఆరుబయట నులక మంచంమీద నడ్డి వాల్చి ...శూన్యాకాశం వంక చూస్తూ పండుకొన్నాడు ... ఏకోపాధ్యాయుడు... పకీరయ్య.

"నీపేరే పకీరయ్య'
నువ్వెంతో అమీరయ్య!

—కవిత్వంకూడా చదివాడు ఆసభలో... ఓ అర్జంటుకవి.
ఓహ్... ఎన్ని ప్రశంసలు... ఎన్ని పొగడ్తలు!
ఎందుకో నవ్వొచ్చింది పకీరయ్యకు
ఆ ప్రశంసలు గుర్తుకువచ్చికాదు...
ఆ లంబోదరాలు జ్ఞప్తికివచ్చి!
కడుపునిండిన ఆ మాటలు గుర్తుకువచ్చి!

—వాళ్ళకేం తెలును తనను గురించి?

బియ్యంకొట్టుదగ్గర ... అపరాలసెట్టిదగ్గర ... కూరగాయల లక్ష్మిదగ్గర... పాలవాడిదగ్గర... అద్దెఇల్లుఆసామిదగ్గర... అన్నిటికంటె అప్పిచ్చిన మార్వాడీదగ్గర...

—తనరూపం వాళ్ళు గుర్తించగలరా?

ఆదీనావతారాన్ని ... ఆ ఉపన్యాసాలిచ్చిన వాళ్ళల్లో ఒక్కణ్ణి ఊహించమనండి! ఒక్కణ్ణి!'

—ఏమిటి తన ధోరణి?

ఆగేడు కాసేపు పకీరయ్య... ఆలోచనఆపి... ఉద్వేగం అణచుకొని

మళ్ళీ అసలు పకీరయ్య!
ఏకో నారాయణో పకీరయ్య!
దినదిన గండం ఫకీరయ్య!
దీనుడైన పకీరయ్య!
అయితేనేం... అతను మనిషి... మనసున్నమనిషి
మళ్ళీ ఆలోచనలు... తేనెతుట్టెలా ఉసుళ్ళపుట్టలా

*　　　*　　　*

తాను ఏకోపాధ్యాయుడు
తానే బడికంతా రాజు... మంత్రి!

తానే కండెక్టరిన్ ...స్వీపర్ ...ప్యూన్ ...క్లర్క్ ...టీచర్ ...తల్లి తండ్రి గురువు ...దైవం...

—ఏదో పద్యం గుర్తుకువచ్చి కాసేపు ఆలోచన ఆగింది.
ఆకలవుతున్నదేమో మళ్ళీ కళ్ళెం పడలింది.
ఒక్కొకక్క రూపం గుర్తుకు రాసాగింది:
మొదట కండక్టరిన్ అవతారం.

ప్రొద్దున్నే అరంభమయ్యే అవతారం
'అమ్మా అయ్యా బాబూ తండ్రీ!'
బతిమలాట బతుకుఆట
అదిలింపులు బెదిరింపులు చీదరింపులు!
వాటితో తల బొప్పెలు కట్టి కాళ్ళీడ్చుకొంటూ
బురదగుంట ప్రక్కగా
పందులు పళ్ళు విదిలిస్తుంటే తప్పుకొంటూ అక్కడ అక్కడ.

పాఠశాల!
అదే పాఠశాల!
పగలంతా పాఠశాల!
రాత్రయేసరికి పశువులశాల!
సర్పంచ్‌గారి గోశాల!
అమ్మయ్య బళ్ళోకొచ్చాను.
ఇక స్వీపర్ అవతారం!
'చీపురేదీ... ఏదీ....ఏదీ ?'
అదిగో తనజీవితంలా అరిగిన చీపురు!
మృదుత్వం కోల్పోయిన ముసలిదైన చీపురు!
'తలపాగన్ ధరియించి....చీపురున్ చేతన్‌ఒట్టి....'
-ఛీ....ఛీ....మళ్ళీ కవిత్వం!
పేడ....రొచ్చు....వాసన....గబ్బు!
నాలుగు బుట్టల ఇసుక
గరుకు గరుకు పొడి ఇసుక
మోసితెచ్చి చల్లాలి .... కోటింగువేసి పిల్లల్ని కూర్చోబెట్టాలి....
లోన మురికి...పైన కోటింగు!
లంబోదరాల వ్యవస్థపై కోటింగు!
- ఏమిటీ రోజు....కళ్ళుమూసినా....తెరిచినా
'లంబోదరగజాననః' శ్లోకం....శోకం
శోకమే శ్లోకం!
అంతటితో అయిందా ?
మళ్ళీ ప్యూను వేషం.
గంటు గొట్టాలి
ఫస్టు బెల్
తనే బెల్....తనే సుత్తి....తనే మోత!
గణగణగణగణ ....
మరిదా నీళ్ళు తేవద్దూ ?
మాటమాటికి మంచినీళ్ళడుగుతారు పిల్లలు
వాళ్ళు మాత్రం యేం చేస్తారు?
కడుపునిండా తిండా....పాడా?
ఆర్థాకలితో వచ్చి అవురావురుమని తాగుతారు
వాళ్ళకు నీళ్ళే పాలు....పాయసం!
అమ్మయ్య....బాన నిండింది
"ఇశ్శో—అశ్శో!'
మళ్ళీ రెండో బెల్
ఆ వెంటనే క్లర్కు అవతారం
స్వీపర్....ప్యూన్.... క్లర్కు మిశ్రమావతారం
మళ్ళీ మూడో బెల్
అప్పుడూ అసలు అవతారం

భావి పౌర శిక్షకుడి అవతారం
ఐదు క్లాసుల ... అష్టావధాన అవతారం
అఆ ఇఈ ... అక్కరకురాని చుట్టము .... ప్లస్ మైనస్
ఇంటూ.... భూమి గోళాకారం.... మాంసకృత్తులు.... విటమిన్లు--
అన్నీ కలగాపులగం.... అన్నీ తానొక్కడే!
తలోపాతం!
తలతలకుపాతం
అలుపు.... దడ.... నొప్పి.... గుండెపోటు
అమ్మయ్య టైం అయింది
అటువిడుపు వచ్చింది.
మళ్ళీ ఇంటికి.... అన్నీ నిండుకొన్న ఇంటికి
చేట అప్పుతోగాని పొయిలోపిల్లి లేవని ఇంటికి
అక్కడా కిసర బాసర ...
కుచేల సంతానం కొట్లాట
ఒక తేరణ గొణధ్వని . . .
మళ్ళీ ఒంటిగంట
ఎప్పటి గానుగెద్దు జీవితం
తలకాయపంతులు ... ప్యూను ... స్వీపర్ ... క్లర్కు
అమ్మయ్య ... నీడ గోడమీదికి పాకింది
గంట ... విడుపుగంట
గణ గణ గణ గణ ...
—ఇదీ తన బ్రతుకు
ఎక్కువ పని.... తక్కువ జీతం
ఎక్కువా.... తక్కువా?
పనిలేని లంబోదరాల్లో కొవ్వు ఎక్కువ
గానుగెద్దు పనిలో నలిగిపోయే తనలో జీవం తక్కువ
'చితుకుతూ.... అతుకుతూ.... బ్రతుకుతూ'
—అరెరె.... మళ్ళీ కవిత్వం .. ఆకలి కవిత్వం .. శోకం కవిత్వం!
తానే కవి ... రవి !
కళ్ళెత్తి చూశాడు పకీరయ్య
ఎదురుగా ... ఎవరు .... ఎవరు ?
విజిట్‌కు వస్తున్న యముడు !
'అప్పుడే బడిమూసేశావేం' అంటున్న యముడు.
అతని ఖరీదు పది.



ఖమ్మం సభల్లో 'పెండింగ్ ఫైలు' నటబృందం.



'మానవుడు' నాటికలో ఒక దృశ్యం

ఆ పది వుంటే తనకు వారం గడుస్తుంది.
మామూలు ... అమ్మాయ్యా !
తొక్కిసలాట! ఎలా.... ఎలా.... పదికావాలి ...
పది కావాలి ... కావాలి ... వాలి ... లి'

* * * *

—మళ్ళీ నవ్వొచ్చింది పకీరయ్యకు.
ఉపాధ్యాయ దినం రోజున చెట్టుకింద కుక్కిమంచం
మీది పకీరయ్యకు
ఏమిటి తన ఆలోచనలు ?
ఆవేశం అణగింది పకీరయ్యకు
ఆలోచన రేగింది పకీరయ్యకు
ఈ లోకంలో తానొక్కడేనా ఉంది ?
తనలాంటివాళ్ళు తనకంటే హీనమైన బ్రతుకు
గలవాళ్ళు ... వేనవేలు ... లక్షోపలక్షలు ... కోటానుకోట్లు
'అంతా కలిస్తే కలిస్తే'
ఓహ్
ఓ ఊరడింపు కలిగింది పకీరయ్యకు
ఓ వజ్రశక్తి ఆవేశించింది అతని బక్క శరీరానికి
—అంతలో బజార్లో ఓ ఊరేగింపు
యు. టి. యఫ్ జిందాబాద్ !
ఐక్యశక్తి జిందాబాద్ !
—సుడిగాలిలా లేచాడు పకీరయ్య
వడివడిగా కదిలాడు పకీరయ్య
ఔను.... ఔను
'తాను బ్రతకలేని' బడిపంతులు కాదు
బ్రతుకుదీర్చు బడిపంతులు !
నవజీవన నిర్మాత బడిపంతుల ?
'పావన నవజీవన బృందావన నిర్మాత ... బడిపంతులు !
-ఓహ్ — మళ్ళీ కవిత్వం
కాని ఇది అబద్ధంగాదు... సుబద్ధం !
ప్రపంచంలో మూడోవంతు నిజం !
-ఆ నిజం తెలిసి అంతెత్తు పెరిగేడు పకీరయ్య
అతడు నిజానికి పకీరుకాదు
పుకార్ !
నవజీవన్ కా పుకార్!

# ప్రశ్నోత్తరాలు

**శ్రీ సూర్యనారాయణరాజు, కోలమూరు - ప. గో. జిల్లా**

ప్రశ్న : ఒక ఉపాధ్యాయుడు సెకండరీ గ్రేడుగా పని చేస్తూ, తెలుగులో బి. ఎ. పాసైనారు. ఆయన గ్రేడు I తెలుగు పండిట్‌గా ప్రమోషన్ పొందుటకు సెకండరీ గ్రేడు సర్వీసును ప్రాతిపదికగా తీసుకొంటారా? తెలియజేయండి.

జవాబు : ప్రొసీడింగ్సు నెం. 12338 జి. 2/69 తేదీ 24-11-69 ప్రకారము గ్రేడు I పోష్టు వేకెన్సీ వచ్చినపుడు గ్రేడు II పోష్టులలో పనిచేయువారిని సీనియారిటీ ప్రాతిపదిక మీద ప్రమోషన్ యివ్వాలి. ప్రమోషన్‌కు అర్హత గల వారు ఆయా సబ్జెక్టులలో గ్రేడు II పండితుల కేడర్‌లో లేనప్పుడు మాత్రమే సెకండరీ గ్రేడ్ కేడర్‌లోని వారిని సర్వీసు ప్రాతిపదిక మీద ప్రమోట్ చేయవచ్చును.

**శ్రీ యస్. రామారావు, తెలుగు పండిట్,**

**జడ్. పి. హెచ్. యస్ తూముకుంట**

ప్రశ్న : రు.290-520 స్కేలులో నున్నవారికి జి. ఓ. యం. యస్. నెం. 370 ఫైనాన్సు మరియు ప్లానింగు తేదీ 16-12-'75 మేరకు రు. 300/-ల పైన రు. 1600/- ల వరకు రు. 128/- లు ఎ డి. ఏ. యివ్వబడినది. రు. 300-400 మధ్య మూలవేతనమున్నవారు, స్పెషల్ పేగూడా పుచ్చుకొంటున్నప్పుడు, స్పెషల్ పేకు ఎ డి ఏ పర్సంటేజి పొందుటకు అవకాశము లేదని కొందరంటున్నారు నిజమేనా ? సందేహము తీర్చండి.

జవాబు : ప్రదేశ్ ప్రభుత్వ ఫైనాన్సు అండ్ ప్లానింగు డిపార్టుమెంటు సర్క్యులరు మెమొ నెం. 441/పి.ఆర్.జి/III/76-1 తే 9-9-76లో Government here by direct that the adhoc dearness allowance sancteoned as percentage rates may be allowed on the special pay' అని యున్న ఆదేశము మేరకు స్పెషల్‌పేమీద గూడ పర్సంటేజి కరువు భత్యము మంజూరు చేయబడవలసియున్నను రూ. 300-400లకు మధ్య జీతము పుచ్చుకొంటున్న వారికి వచ్చు స్పెషల్‌పేగూడ రూ. 400/-ల లోపు జీతములోనే కలిసియున్న స్థితిలో ఆ మొత్తమునకు ప్రభుత్వముచేత నిర్ణయించబడిన కనిష్ట ఎ డి ఏ. రూ. 128/- లు మాత్రమే రాగలదు తప్ప ప్రత్యేకముగా స్పెషల్‌పేకు వేరొక మొత్తం రాదు అనగా మూల వేతనము మరియు స్పెషల్‌పే కలిసి మాత్రమే పేరేంజిగా పరిగణించబడును.

**శ్రీ బి. సంపత్‌కుమార్, గుంతకల్లు 2, అనంతపురంజిల్లా**

ప్రశ్న : రూ. 96-200 స్కేలులో మ్యాగ్జిమం చేరుకొన్న సెకండరీ గ్రేడు ఉపాధ్యాయులకు మొదటిదఫా సెలక్షను గ్రేడు పోస్టులు పంపకాలు జరిగాయి. రెండవసారి మంజూరైనపోస్టులు పంపకాలు జరగవలసియున్న సందర్భములో, సీనియారిటీ అని చెప్పి జి ఓ. కాస్త సడలించినట్లు వింటిమి-అయితే సీనియారిటీ లేకున్నా కొందరు 1975 నాటికే మ్యాగ్జిమం చేరుకొన్నారు ఇట్టి వారికిచ్చిన పిదప మిగిలిన పోస్టులు సీనియారిటీ ప్రకారం యిస్తారా? లేక మంజూరుకాబడిన పోస్టులనన్నిటిని కేవలం సీనియారిటీ ప్రాతిపదిక మీదనే పంపకాలు చేస్తారా? వివరించండి.

జవాబు : మంజూరు అయిన పోష్టులన్నింటిని సీనియారిటీ-కం మెరిట్ మీద పంపకాలు చేయవలసియుండి-ఇందుకు సంబంధించిన జి.ఓ.యమ్ యస్. నెం. 1196 ఎడ్యుకేషన్(హెచ్) డిపార్టుమెంటు తే 30-11-73 నకు అనుబంధముగా జారీచేయబడిన డ్రాఫ్టు రూల్సు 1 వ భాగము క్రిందనున్న 5 వ రూలులో "Appointment by Promotion to selection grade shall be made strictly according to seniority-Cum-merrit" అనియున్న ఆదేశమును పరిశీలించండి.

**శ్రీ బి. జాన్, టీచరు, రామేశ్వరం, తూ. గో. జిల్లా**

ప్రశ్న : విద్యార్థుల ఫీజుల మినహాయింపు సదుపాయముల కొరకు తల్లిదండ్రుల సాలుసరి ఆదాయపు పరిమితిని రూ. 3600/-ల నుండి రూ. 6000/-ల వరకును పెంచినట్లుగా విన్నాను. ఆ జి. ఓ. వివరములు తెలియజేయండి.

జవాబు : అవును పెంచుట జరిగింది. ఇందుకు సంబంధించిన జి ఓ. యం. యస్. నెం. 125 సోషల్ వెల్ఫేరు (ఇ) డిపార్టుమెంటు తేది 15-4-1977ను జూలై సంచికలో ప్రచురించాము. పరిశీలించండి.

**హెడ్మాష్టరు, వేములకోట, మార్కాపురం తాలూకా,**

**ప్రకాశం జిల్లా**

ప్రశ్న : స్పెషల్ పేగానున్న హెడ్మాష్టరు అలవెన్సునకు తేదీ 1-1-74 నుండి ఎ.డి.ఏ. రావలయునుగదా !

జవాబు : అవును రావలయును అయితే జి. ఓ యం.యస్. నెం. 180 ఫైనాన్సు మరియు ప్లానింగు తేదీ 15-1-75లోని ఆదేశము మేరకు తేదీ 1.3-75 నుండి మాత్రమే ఆర్థిక సదుపాయము కలిగించబడును. ఫైనాన్సు మరియు ప్లానింగు డిపార్టుమెంటు సర్క్యులరు మెమో నెం 441/పి ఆర్. జి /III/76-1 తేదీ 9-7-76 లోని ఆఖరు పేరాలో "The monitary benefit of counting special pay towards adhoc D.A. shall be allowed from 1-5-75 the date for which the benefit of revised scales orderd in the G. O. 2nd dated has been allowed" అని యున్న ఆదేశమును పరిశీలించండి.

**గ్రేడు II తెలుగుపండిట్, నేతివారిపాలెం, ప్రకాశం జిల్లా**

ప్రశ్న: నేను 3 సంవత్సరముల నుండి పి.యస్ యు.సి. స్కూలులో అన్‌ట్రెయిండు గ్రేడు II తెలుగు పండిట్‌గా పని చేస్తున్నాను. స్పెషల్ తెలుగులో బి. ఏ. పరీక్షలో కృతార్థుడనైతిని. ట్రయినింగుకు వెళ్ళుటకు సంకల్పించి, మా బి.డి.ఓ. గారిని అడిగితే జీత నష్టముమీద పంపిస్తామన్నారు. డిప్యూటేషన్ ప్రాతిపదికమీద అన్‌ట్రయిండు టీచర్లను జీతముమీద ట్రయినింగుకు పంపుటకు అవకాశము లేదా? తెలియజేయండి.

జవాబు: లేదు. జి. ఓ. యం. యస్. నెం. 1110 ఎడ్యు

కేషన్ (బి) డిపార్టుమెంటు తే 13-12-76 ద్వారా యీ అవకాశాన్ని ప్రభుత్వం లేకుండా చేసివేసింది. ఈ జి. ఓ. లో 'Government ofter careful consideration decdeid the Practice of deputing in service (untrained) teachers Viz. Physical Education Teachers Telugu Pandits, Drawing Masters and Manual Training Instructors to the Training course be abolished with effect from the next academic year (ie) 1977-78' అని జారీ చేసిన భాగమును పరిశీలించండి.

**శ్రీ సి. హెచ్. జేసురత్నం, సీతారాంపురం ప. గో. జిల్లా**

ప్రశ్న : తే 8-7-74 న సర్వీసు నుండి రిటైరు అయిన ఒక ఉపాధ్యాయునకు పెన్షను మంజూరై వచ్చినది. గ్రాట్యూటీ మాత్రం రాలేదు ఈ గ్రాట్యూటీ బట్వాడాకు ఈ ఉపాధ్యాయుడు మరలఏమైనా ప్రయత్నం చేయవలెనా? లేక ఆలస్యం అయినప్పటికిని ప్రభుత్వంవారే యిచ్చెదరా? తెలపండి.

జవాబు : రెండును కలిసి ఒకేసారి రాకుండా పెన్షను మాత్రం వచ్చి, గ్రాట్యూటీ రాకపోవుటకు ఏదో కారణము ఉంటుంది. బహుశా మేనేజిమెంటు, బోనసు మినహాయింపుల వివరముల సర్టిఫికేటు పంపుటలో జాప్యం జరిగి ఉండవచ్చును. ఎక్కౌంటెంటు జనరల్ గారి ఆఫీసు జిల్లా విద్యా శాఖాధికారి గారి ద్వారా, పెన్షను అర్డరునకు ముందు ఈ ఉపాధ్యాయునకు కమ్యూనికేటు చేయబడిన పెన్షను వెరిఫికేషను అర్డరును పరిశీలించిన ఆ కారణము దొరుకగలదు. ఆ కారణము మేరకు తగు చర్యలు తీసుకొనుటకు తగు కృషి చేయుటయే గాకుండా, వేగముగా గ్రాట్యూటీ మంజూరు ఉత్తరువును పంపి తోడ్పడ వలసినదిగా కోరుచూ జిల్లా విద్యాశాఖాధికారిగారి ఆఫీసు ద్వారా ఎక్కౌంటెంటు జనరల్ ఆఫీసునకు ఈ ఉపాధ్యాయుడు రిప్రజెంటేషను పంపునట్లుగా చూడండి దాని కాపీ మీ జిల్లా శాఖకు పంపినయెడల వారుగూడ రిప్రజెంటు చేసి తోడ్పడగలరు.

**శ్రీ పి. నారాయణమూర్తి, భీమవరం, ప.గో. జిల్లా**

ప్రశ్న : సుమారు 23 సంవత్సరముల సర్వీసుచేసి, మా పట్టణములో ఒక ఉపాధ్యాయుడు 1971 సం॥ ఏప్రిల్ నెలలో స్వర్గస్థులైనారు. అయన భార్య మా పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. ఆమె కుటుంబ పెన్షనుకు దరఖాస్తు పంపుటకు వీలున్నదా? వీలుంటే అందుకు సంబంధించిన విధానమును తెలియజేయండి.

జవాబు: దరఖాస్తు పంపుకొను అవకాశములేదు. 1973 సం॥ ఏప్రిల్ నెల 1న తేదీకి ముందు సర్వీసు నుండి రిటైరు అయిన లేక స్వర్గస్థులైన ఉపాధ్యాయులకు లిబరలైజుడు పెన్షను, డెత్-కం రిటైరుమెంటు గ్రాట్యూటీ, కుటుంబ పెన్షను సదుపాయములు వర్తించు అవకాశములేదు.

---

పాఠ్యగ్రంథాలూ—తీరుతెన్నులూ

# తప్పుల తడకల సామాన్యశాస్త్రం

శ్రీ పి. రఘునాథరెడ్డి, హెడ్మాష్టర్
యెల్లారెడ్డిగూడ, నల్గొండజిల్లా

ఒక యథార్థాన్నిగూర్చి ఎన్నిసార్లుచెప్పినా, ఏ భాషలో మార్చి చెప్పినా, ఏ తరగతిలో చదివినా ఒకేవిధంగా ఉండాలి. అందులో శాస్త్రవిషయాల్లో ఇంకా ఖండితంగా ఉండాలి మచ్చుకు క్రింది విషయాలు చూడండి ... ఎంత సొబగుగా ఉన్నాయో!

1. 9వతరగతి వృక్షశాస్త్రం 3వపేజీలో జాతి = Genus 15వ పేజీలో తెగ = Species.

10వతరగతిజీవశాస్త్రంలో 21వపేజీలోగణము = Genus జాతి = Species మళ్ళీ 9, 10 తరగతులకు వృక్షశాస్త్రంలో జాతి = Genus

—పై ఉదాహరణల ప్రకారం 'జాతి'అనే తెలుగు పదం దేనికనువాదం?

2. 10వ తరగతి జీవశాస్త్రంలో 131వ పేజీ మెదలా (Medulla ablangata) 132వపేజీలో వెన్నుబాము(Medulla ablangata) మెదుల్లా వెన్నుబాము ఒకటేనా?

3. 9 వ తరగతి భౌతిక శాస్త్రం. 113 వ పేజీ: కంటిలో నున్న కటకము వస్తు దూరమునుబట్టి రెటినాపై ప్రతిబింబము ఏర్పడునట్లు తన వక్రతను మార్చుకొనుటకు పనిచేయును. 10 వ తరగతి జంతుశాస్త్రం 145 వ పేజీ 'కెమేరాలోని కటకముపై పడు కాంతి కిరణము ఒక కేంద్రములో పడునట్లు అందలి రంధ్రము నెట్లు సరిదిద్దతగిన దూరములో నుంచుదురో మానవుని కంటియందు కంటిపాప అట్టి విధినే నిర్వర్తించును.'

పై వివరణను బట్టి రెటీనాపై సరిగా పడునట్లు చేసేది కటకమా ? కంటిపాపా ?

4. 9 వ తరగతి భౌతికశాస్త్రం 112 వ పేజీ 'కంటిలో ఉండునది కుంభకటకము' 10 వ తరగతి జంతుశాస్త్రం 140 వ పేజి 'కృష్ణ పటలము వెనుక ద్విపుట కటకము'

— ఇంతకీ కంటిలో ఉండేది కుంభాకార కటకమా ? ద్విపుట కటకమా ?

(5) 10వ తరగతి వృక్షశాస్త్రం 87వ పేజీ సమృద్ధిగా ఆహారము లభించుట వలననే అలింగ ప్రవర్తనము జరుగును.

ఆదే పేజీలో "తగినంత ఆహారము లభించినపుడు శిలీంధ్రము అలింగ ప్రత్యుత్పత్తి జరుపుకొనలేక లింగ ప్రత్యుత్పత్తి విధానమవలంబించును"

-పై దాన్నిబట్టి తగినంత ఆహారము లభించునపుడు మ్యూకారులో జరుగునది లింగప్రవర్తనమా ? అలింగ ప్రవర్తనమా ?

(6) 10వ తరగతి వృక్షశాస్త్రంలో క్లిస్టొగామికి ఉదాహరణలిస్తూ 'అక్సాలిస్' పుష్పాలు వికసించకుండా తప్పనిసరి ఆత్మ పరాగసంపర్కం కలిగి వుంటాయి. ఆ పుస్తకంలోనే మరోచోట 'అక్సాలిస్' పుష్పాల అమరిక ఆత్మపరాగ సంపర్కాన్ని నిరోధిస్తాయి. అందువలన వీటిలో విధిగా పరపరాగ సంపర్కం జరుగుతుంది అని ఉంది.

—ఏది నిజం ?

# శ్రీ యం. మాధవరావు (యం.యల్.సి) గారి కృషి

(శ్రీ యం. మాధవరావుగారి కృషి రిపోర్టు నెలనెలా ప్రచురిద్దామనుకొన్నా మహాసభ అవాంతరాల వలన అలా చేయలేక పోయాము. అందువలన 77 జూన్ నుండి ఆయన చేసిన కృషిని సమీక్ష రూపంలో ఇస్తున్నాము — సం॥)

గత నాల్గు నెలల్లో శ్రీ మాధవరావుగారు దాదాపు ఎనభైసమస్యలపై అధికారులతో ప్రాతినిధ్యంజరిపేరు. అందులో సమిష్టి సమస్యలతోపాటు వ్యక్తిగత సమస్యలకూడా ఉన్నాయి.

నల్గొండ జిల్లాలో ప్రభుత్వ హామీలకు వ్యతిరేకంగా 78 బదిలీల స్టేటస్ క్వో సాధన, ఇతర భాషా రాష్ట్రాలలో చదివి ఉత్తీర్ణులైన విద్యార్థులను మనరాష్ట్రంలోని జూనియర్ కళాశాలలలో చేర్చుకొనే వివరణ, అలాగే బొంబాయి హిందీ విద్యా పీఠంవారి సాహిత్య సుధాకర పరీక్ష గుర్తింపు విషయం, యం.ఇ.డి. అర్హతలుగల ప్రభుత్వేతర ఉపాధ్యాయుల్ని ట్రయినింగు స్కూళ్ళలో నియామక విషయం, డిగ్రీ పరీక్షల మార్కుల మెమోలు ఆయాఅభ్యర్థులను త్వరగాపంపేవిషయం, ఎయిడెడ్ పాఠశాలల గ్రాంట్స్ రిలీజు, టి.యస్.సి. పరీక్షలో మార్కులు కన్సెషన్, జాతీయం చేసిన పుస్తకాల సక్రమ పంపిణీ, జూనియర్ కాలేజీలలో సెకండరీషిఫ్ ప్రభుత్వ సర్వీసులోకి విలీనం మొదలగు రాష్ట్రమంతటినుండి వచ్చిన వివిధ సమస్యలపై రిప్రజెంట్ చేయటం జరిగింది.

నెల్లూరుజిల్లా సమస్యలు: వరకలిపూడి పి.పి. యం. హైస్కూలుకు చెందిన శ్రీ ప్రసాదరావును ఆ పాఠశాల కరస్పాండెంట్ అక్రమంగా తొలగింపగా డి.యి.ఓ గారిని రిప్రజెంట్ చేసి, తగు చర్య తీసుకోగలమని హామీ పొందేరు. గూడూరు గరల్స్ హైస్కూలులో పి.ఇ.టి.గా పనిచేస్తున్న శ్రీ లాజరస్ 1961 లో వేతనాల సవరణ సందర్భంగా ఆప్షన్ ఇవ్వని కారణాన నెలకు రు. 45 లు మాత్రమే మూలవేతనం పొందుతున్నారు. ఆ విషయం పరిశీలించి న్యాయం కలుగజేయవలసిందిగా జడ్ పి ప్రత్యేకాధికారితో ప్రాతినిధ్యం జరిపారు. కోవూరు తాలూకా, నెల్లూరు తాలూకాలకు చెందిన కొన్ని గ్రామాలకు విద్యుచ్ఛక్తి ప్రారంభింపవలసిందిగా రిప్రజెంట్ చేశారు. నెల్లూరులోని యస్.వి. ప్రాథమికోన్నత పాఠశాల కరస్పాండెంట్‌కు శ్రీ పెంచలయ్య సమస్య పరిష్కరింప వలసిందిగా లేఖ వ్రాశారు వాకాడు పి. కె ఎన్: బాలికోన్నత పాఠశాలకు చెందిన టి. సుజాతమ్మ డెప్యుటేషన్ వేతనం ఇవ్వవలసిందిగా డి.యి.ఓ.ను రికమెండ్ చేశారు. కరీంనగర్‌జిల్లాలో పనిచేసి ప్రస్తుతం నెల్లూరు జిల్లాలో పనిచేస్తున్న శ్రీయం. పోతరాజుకు వేతనాలు చెల్లించే చర్యలు తీసుకోవలసిందిగా పంచాయతీరాజ్ శాఖామంత్రిగారితో ప్రాతినిధ్యం జరిపారు. వెంకటగిరి విశ్వోదయ కళాశాల అధ్యాపకులకు వెంటనే గ్రాంట్లు విడుదల చేయవలసిందిగా ఉన్నత విద్య సంయుక్త కార్యదర్శి గారితో రిప్రజెంట్ చేశారు. వింజమూరు సమితికి చెందిన శ్రీ జె. నాగయ్య, 1964లో రిటైరైన శ్రీ కె. దేవదానం పెన్షన్ సమస్యలపై ప్రాతినిధ్యం జరిపారు.

చిత్తూరుజిల్లా సమస్యలు : చిత్తూరులోని పి.సి. ఆర్. ప్రభుత్వ జూనియర్ కళాశాల మాజీఅధ్యాపకుడు శ్రీ నాదమునిగార్కి రివైజ్‌డ్ యల్.పి.సి సర్వీసురిజిష్టరులను స్వాధీనం చేయవలసిందిగా ప్రిన్సిపాల్‌గార్కి లేఖ వ్రాశారు. నిర్బంధ రిటైర్‌మెంటుకు గురైన శ్రీ బి. చెంగల్‌రెడ్డి విజ్ఞప్తిని రివ్యూ చేయవలసిందిగా విద్యాశాఖ సహాయ కార్యదర్శిగారితో ప్రాతినిధ్యం జరిపేరు. ఉన్నత విద్యార్హతగల శ్రీబి. రామచంద్రారెడ్డిగారికి జె యల్. ప్రమోషన్ విషయం ఉన్నతవిద్యా జాయింట్ డైరెక్టరుగారితో ప్రాతినిధ్యం జరిపారు. చిత్తూరులోని కణ్ణన్ జూనియర్ కాలేజీలో శ్రీమతి సి డి. శాంతకుమారిని తిరిగి చేర్చుకోవాలని ఉన్నతవిద్య జాయింట్ డైరెక్టరుగార్కి రిప్రజెంట్ పంపారు తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలోని ప్రాథమికపాఠశాలలో పనిచేసి రిటైరైన శ్రీ పి. సుబ్రహ్మణ్యం గార్కి ఇతర సంస్థలలో పనిచేసిన కాలాన్ని కూడా పెన్షన్ లెఖ్ఖ పెట్టుటలో కలపాలని డిప్యూటీ డైరెక్టరుగార్కి రిప్రజెంట్ చేశారు.

యు.జి.సి. వేతనాల అమలుకు కళాశాల అధ్యాపకులు నిర్వహించిన 'మార్చ్ టు అసెంబ్లీ' ప్రదర్శనలో పాల్గొని ఇతర లెజిస్లేటర్లతోపాటు అధ్యాపకులకు అండగా నిలబడ్డారు.

## శాసనమండలిలో....

శ్రీ మాధవరావుగారి శాసన మండలిలో ప్రసంగాలు అధికార ప్రతిపక్ష పార్టీల సభ్యులకు బాగా ఆకర్షిస్తున్నాయి. మండలిలో ఆయన చేసిన సుదీర్ఘ ప్రసంగం త్వరలో మన పత్రికలో వస్తుంది. 24.3-77 న భూపంపకం విషయమై ముఖ్యమంత్రి చేసిన ప్రకటనను ఖండిస్తూ ఆయన ఇలా అన్నారు.

'ముఖ్యమంత్రిగారి ప్రసంగాన్ని నేను ప్రొటెస్ట్ చేస్తున్నా. 10 లక్షల ఎకరాలలో మీరు స్వాధీన పరచుకొన్నది 1 లక్షా 75 వేల ఎకరాలు. అంటే 17 5 శాతం. దానిలో పంపకం చేసింది 1985 ఎకరాలు. అంటే ప్రభుత్వ ఎఫిషియెన్సీ 8 శాతం మాత్రమే !'

కౌన్సిల్ సమావేశాలు అనుకున్న విధంగా సాగితే శ్రీ మాధవరావుగారి ప్రశ్నలు కొన్ని కాల్ అటెన్షన్ మోషన్‌కి వచ్చి వుండేవి. వాటిల్లో కొన్ని ...

(1) ప్రకాశంజిల్లా, కనిగిరి సమితికి చెందిన శ్రీమతి వై. మాణిక్యమ్మ 17-6-64న రిటైరయింది. ఈనాటికి పెన్షన్ మంజూరు కాలేదు. కారణమేమిటి ?

(2) చిత్తూరు, తిరుపతి పట్టణాలలో ప్రతితరగతిలోను 80, 90 మంది విద్యార్థులున్నారు. ఆ స్థితిలో విద్యాస్థాయి పడిపోదా? అదనపు వసతి, మరింతమంది అధ్యాపకుల నియామకం ఎందుకు చేయరు ?

(3) చిత్తూరు జిల్లాలో అనేక పాఠశాలల్లో తమిళ మీడియం తరగతులున్నాయి. కాని అధ్యాపకుల నియామకం జరగటంలేదు. అదిమైనారిటీ భాషల వారిని నిర్లక్ష్యం చేయటం గాదా ?

-కౌన్సిల్ అకస్మాత్తుగావాయిదావడటంతో ఈప్రశ్నలు చర్చకు రాకుండానే పోయాయి.

# ఖమ్మం విద్యా మహాసభలో ఎడ్యుకేషనల్ సింపోజియం

# ప్రారంభోపన్యాసం

ప్రొ. కె. వెంకట్రామయ్య

ఉపాధ్యక్షులు, కాకతీయ విశ్వవిద్యాలయం

సమాజంలో అన్నివర్గాలవారు నేటి విద్యా విధానంలో అన్ని స్థాయిలలోను మౌలిక సంస్కరణలు కావాలని కోరుతున్నారు. ప్రస్తుత విద్యా విధానంలోని లోటుపాట్లు ముందు తెలుసుకొంటే ఆ తర్వాత వాటినెలా సంస్కరించాలో అవగతమౌతుంది.

1. ప్రస్తుత విద్యాలయాల్లో తయారౌతున్న వ్యక్తుల్లో శీఘ్రగతిని మారుతున్న సమాజానికనుగుణంగా అవసరమైన ప్రాథమిక నైపుణ్యం కొరవడుతున్నది.

2. ప్రస్తుత విద్యావిధానం కోట్లాది యువజనుల విద్యావసరాలను తీర్చటంలో దాని ప్రాముఖ్యతను గుర్తించటంలో విఫలమైంది.

3. విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకొన్న దానికి, ఆ తర్వాత బాహ్య జీవితానికి సమన్వయం కుదరటం లేదు.

4. విద్యార్థులకు నేర్పుతున్నదానికి, సమాజావసరాలకు పొంతన కుదరటంలేదు వ్యవసాయానికి, పరిశ్రమలకు, ఇతర వృత్తులకు, సమాజావసరాలన్నిటికీ నేటివిద్య తోడ్పడటంలేదు.

5. ఉన్నత పాఠశాలలనుండి, కళాశాలలనుండి బయటకు వస్తున్న పలువురు విద్యార్థులలో స్వతంత్ర ఆలోచనా ధోరణిగాని, స్వబుద్ధితో నిర్ణయం చేయగల సమర్థతగాని, శ్రమపట్ల అవసరమైన దృక్పథంగాని కన్పించటంలేదు.

6. విద్యాలయాల బయట చదువుకొనేఅవకాశం దాదాపు పూజ్యం. ఆచరణలో ఈ సమస్యపై దృష్టి కేంద్రీకరింపబడలేదు.

7. ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు చెందిన విద్యార్థుల అవసరాన్ని ప్రస్తుత విధానం తీర్చటంలేదు.

8. వయోజన విద్యను గురించి ఏ మాత్రం పట్టించుకోకపోవటంతో నిరక్షరాస్యత ప్రబలటమేగాక ఏదో ఒక స్థాయి వరకు చదివి విద్యను కొనసాగించలేనివారు తమస్థాయిని అభివృద్ధి చేసుకోటానికి అవకాశాలు మృగ్యాలుగా ఉన్నవి.

9. నిర్ణయాలు చేసినంతమాత్రాన అంతా సాధించామనుకోవటంగాక నిర్దిష్టమైన అభిప్రాయాలతో అన్నిటా వెనుకబడిన మనదేశాన్ని ఆచరణలో పురోగమింపజేయాలి. నేటి విద్యావిధానం ఈ విషయంలో ఆశించిన ఫలితాలనీయటంలేదు. అందుకనే మన విద్యావిధానం పలు విమర్శనలకు గురిఅవుతున్నది.

వీటినధిగమించాలంటే ఉపాధ్యాయులు దృఢనిశ్చయంతో ఆచరణ యోగ్యమైన విద్యా సంస్కరణల్ని సూచించాల్సిఉంది. కార్యాచరణతోకూడిన విద్యా సంస్కరణ నేడెంతయినా అవసరం. ఉత్పత్తి లక్ష్యాలనేగాక, మానవతా లక్ష్యాల ప్రాముఖ్యతనుగూడ భారత విద్యావిధానంలో పొందుపరచాలి.

విద్యార్థి విద్యాలయాలు వదిలేసరికి ఈక్రింది నైపుణ్యతలు అలవడాలి. 1) ప్రాథమిక విద్యానైపుణ్యతలు 2) పనిచేయుటలో మంచి అలవాటు, 2) వృత్తి నిర్ణయ నైపుణ్యత 4) ఉద్యోగాన్వేషణ నైపుణ్యత 5) ఉద్యోగం సాధించే నైపుణ్యత 6) వృత్తిలో ఉన్నత స్థాయిని చేరుకోటానికి కావల్సిన నైపుణ్యత, 7) వ్యక్తిగత విలువలతోపాటు శ్రమ విలువను సమన్వయించి జీవిత మార్గాన్ని నిర్ణయించుకొనే నైపుణ్యత

విద్యావిధానం పాఠశాలల్లోను, పాఠశాలల్ని వదిలిన తర్వాత వేర్వేరు వృత్తి సంబంధమైన నైపుణ్యాల్ని పెంపొందించేదిగా ఉండాలి. పరిసర పరిస్థితుల్ని గమనించేదిగా ఉండాలి. విద్యార్థుల అవసరాలకు తగినట్లుగ విద్యాలయాల్లో ప్రవేశ నిష్క్రమణలకు అవకాశంఉండాలి. పైలక్ష్యాన్ని సాధించేందుకు ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమంలోను, బోధనా పద్ధతుల్లోను సమూలమైన మార్పులుచేయాలి. విద్యార్థులనైపుణ్యాన్ని పెంచే సర్వాధికారం తరగతి ఉపాధ్యాయునికి ఉండాలి.

సార్వజనీన విద్యావసరాన్ని నేటిసమాజం గుర్తించింది. దానితోపాటు సాంకేతికవిద్యల్లోకూడా మార్పు నేడు అవసరంగా కన్పిస్తున్నది.

ఈనాడు మన తక్షణ కోర్కెలతో ఉపాధికల్పించేవిద్య కావాలనేది ప్రధానమైనది. పేదదేశం... వర్ధమాన దేశమైన మనలాంటి దేశంలో విద్యాభ్యాసానికి, పనికి ఎటువంటి సమన్వయంలేదు. అనేకమంది పట్టభద్రులు ఉన్నత అర్హతలున్నా ఏ పని చేయటానికైనా సంసిద్ధులైనా, నిరుద్యోగులుగనే మిగిలి ఉంటున్నారు.

ఈ అనర్థాలకు కారణం 'అలస్యంగాపెరిగే ఆర్థికస్థాయి' అనవచ్చును. కాని మూలకారణం అదొక్కటిమాత్రమే కాదనీ, విద్యావ్యాసంగానికి యథార్థ జీవితానికి పొంతన లేకపోవటమే ప్రధాన కారణమని సర్వే సర్వత్ర వినవస్తున్నది. దీన్ని సరిచేయాలంటే సామాజిక ఆర్థిక వ్యవస్థల్ని మార్పుచేసి, పనిచేసే కేంద్రాన్ని విద్యాసంస్థలుగాకూడా ఉండేట్లుచేయాలి. ఈవిధంగా విద్యను పరిశ్రమలకు సంధానపరిస్తే విద్యతోపాటు ఉత్పత్తిశక్తి కూడా అభివృద్ధి అవుతుంది. అయితే ఈ మార్పు ప్రస్తుత యథాతథ స్థితిలోమాత్రం సాధ్యంగాదు.

విద్యాలయాలనుండి బయటికివచ్చి, వెంటనే పనుల్లో ప్రవేశించాలంటే దానికి తగిన తీవ్రమైన సామాజిక ఆర్థిక మార్పు అవసరం. మొత్తం అందరికీ ఉద్యోగాలు కావాలనే దానికి బదులుగా యువకులైన వారికి ఎక్కువ అవకాశాలు కొరకు ప్రయత్నించటం మంచిది. ఆ యువకులకుకూడా పనిలో శ్రద్ధకల్పించే విధానంకూడా మనం రూపొందించాలి.

రోజుకు రెండు గంటలు వృత్తి సంబంధమైన రంగంలో విద్యార్థులు విద్యగడించే అవకాశాలుంటే పరిశ్రమలు, విద్యలమధ్య సహకారం సమన్వయం వుండగలదు. అప్పుడు విద్యార్థికి కొద్దిపాటి ప్రతిఫలంకూడా ఇవ్వాలి. అమెరికాలో ఇట్టి 'నిపుణతా కేంద్రాలు'వున్నాయి. ఆ కేంద్రాలకు వ్యాపార వర్గాలవారు కూడా సలహాసంఘ సభ్యులుగా వుండటంవలనే పాఠ్య ప్రణాళికకు, వ్యాపార కేంద్రాలకు సంబంధం ఏర్పడటానికి వీలయింది.

నిజంగా వృత్తివిద్య ప్రజల్ని ఉద్యోగార్హులుగా తయారు చేయగలదా ? అనేది అసలు ప్రధాన సమస్య. భారత దేశం వంటి విశాల దేశంలో వృత్తి విద్యావ్యాప్తికి హెచ్చు మొత్తా

లను ఖర్చుపెట్టటంతోబాటు సరియైనప్రణాళికకూడా అవసరమై యున్నది.

ప్రత్యేక నైపుణ్యం లేకపోతే ఉద్యోగం దొరకటం కష్టసాధ్యం.కాని క్షణంక్షణంమారుతున్న ఈసాంకేతిక యుగంలో, ప్రత్యేకనైపుణ్యాన్ని అలవరిచే పాఠశాలలు కూడా తక్కువగానే ఉన్నవి.అందువలన నిపుణతా కేంద్రాల్లో ఆయా పారిశ్రామికరంగాల్లో పరిచయం, మంచిపని అలవాట్లు,ఆలోచనావిధానం, కలిగిస్తే ప్రస్తుతంసరిపోతుంది.ఉన్నతపాఠశాలల్లో విద్యార్థులువృత్తుల గూర్చి, వ్యాపార కేంద్రాలగూర్చి ప్రాధమిక జ్ఞానం సంపాదిస్తే భావి విద్యాభ్యాసానికి అది చక్కగా తోడ్పడుతుంది. క్రియానుభవము, విద్యలయొక్క కలయికయే జీవితంలో విజయం పొందటానికిమూలం. నిపుణత్వాన్ని గౌరవించే సమాజమే నాగరిక సమాజం. అట్టిసమాజంలో గాయకులు, నర్తకులు, కళాకారులు వారి వారి నైపుణ్యాల మేరకు ఇప్పటికంటె ఎక్కువగా గౌరవింపబడతారు.

ఈ సందర్భంలో ఆదర్శ ఉపాధ్యాయుడి లక్షణాన్ని పేర్కోవటం అప్రస్తుతం గాదనుకుంటాను.

ఆదర్శ ఉపాధ్యాయుడికి క్రమబద్ధమైన అలవాట్లుండాలి. యంత్రం లాగాక స్వబుద్ధితో ఆత్మవిశ్వాసం పెంచుకోవాలి. మానవశక్తిపై అపార విశ్వాసముండాలి. అప్పుడు మాత్రమే అతడు నమ్మిన దానికోసం అంకితం కాగల్గుతాడు. దేశ సౌభాగ్యంకోసం, సామాన్య మానవుని సేవకోసం, సంఘ సంస్కరణలకోసం ముందుకు పోగల్గుతాడు. అదే ఉపాధ్యాయుల్లో నేడత్యవసరం.

---

## జీవిత చందాలు

144. శ్రీ సి. హెచ్. ఆదినారాయణ
రాయకుదురు, ప. గో. జిల్లా

145 శ్రీమతి ఆర్. లక్ష్మిదేవి,
అమలాపురం, తూ. గో. జిల్లా

146. శ్రీ కె. రామమోహనరావు
కట్టుపాలెం. ప. గో. జిల్లా



147. శ్రీ కె. వెంకట్రామయ్య
భీమవరం, ప. గో. జిల్లా

148 శ్రీ ఆర్. మోహనరావు
కూనుమంచి, ఖమ్మంజిల్లా

—అందరికీ మా అభివందనలు

## కర్తవ్యం

—శ్రీ యం. మార్క్, రంగపూర్

ఈ దేశంలో ... మన దేశంలో
నిరక్షరాస్యత నిత్యం వర్థిల్లే దేశంలో
నిరుద్యోగం ... దారిద్ర్యం నిండు కొలువున్న దేశంలో
నీ... నా కర్తవ్యమేమిటి?
చూపింది ... అదేఖమ్మం
వెలుగుబాట ... వెన్నెలతోట!
కులమత కర్మ సిద్ధాంతాలు
కుళ్ళి గబ్బు కొడుతున్నచోట
దోపిడీ స్వార్థాల సాలెగూళ్ళు
నిలువునా ఖూనీచేసే చోట
చదువుకొన్న మూర్ఖులు
ఏడుకొండల్ని ఎగబ్రాకుతున్న చోట
మనమిచ్చే వెలుగేమిటి?
అదే చూపింది ఖమ్మం
అల్ప ప్రాణులకు తోడుగా ఉండండని!
మామూలు మనుషుల్ని మహోన్నతులుగా మార్చండని!

## జిందాబాద్ యు. టి. యఫ్!

—శ్రీ డి. సుబ్బారావు, ప్రకాశం జిల్లా.

అవి 'ఖమ్మం' మహాసభలు
మరపురాని మధుర స్మృతులు!
పెల్లుబికిన వెల్లువలా
పొంగిపొరలు కెరటాల్లా
ఆరువేల ప్రతినిధులహో
అరుదెంచిరి ఆ సభలకు!
యు.టి.యఫ్. బావుటాల
అరుణారుణ తోరణాలు
సమాగత బృందమ్ముకు
స్వాగత వచనమ్ముపలికె.
ఉద్ఘాతల నూగించెడు
ఉపన్యాసాలాలించిరి.
ఉత్తేజితులై ఒజ్జలు
కర్తవ్యం గుర్తించిరి.
సమైక్యతా బలంకంటె
జగతిలోన నేమున్నది?
కోర్కెల సాధనకిదియే
మార్గమ్మని తలపోసిరి.
హక్కుల రక్షణకిదియే
ఆయుధమని భావించిరి.
కర్తవ్యం బోధపడగ
కార్యోన్ముఖులై నిల్చిరి!
యు టి యఫ్ విజయగాధ
ఊరూరా చాటజనిరి.
జిందాబాద్ యు టి.యఫ్!
యు.టి.యఫ్ జిందాబాద్!!

విద్యాగోష్ఠి

# ప్రత్యామ్నాయ విద్యా విధానం

—శ్రీమతి అనిలాదేవి

ప్రధాన కార్యదర్శి, ఎ.బి.టి.ఎ.

ప్రస్తుత విద్యా విధానం పనికిమాలినదని మనందరకు తెలిసిన విషయమే. అది మారుతున్న సామాజికావసరాలను తీర్చేదిగా లేదు. దోపిడీ వ్యవస్థకు చెందిన ఆర్థిక విధానాన్ని అవలంబించటం తదనుగుణంగా విద్యను రూపొందించటంవలన ప్రస్తుత పాలకులు విద్యావిధానంలో పై పై మెరుగులుదప్ప మౌలికమైన మార్పులు తీసుకురాలేక పోతున్నారు.

ఉత్పత్తి విధానానికి సంబంధం కలిగి వుండక పోవడమే ప్రస్తుత విద్యా విధానంలో ప్రధాన లోపం. నైపుణ్యంలేని లేక కొంత నైపుణ్యంగల కార్మికులు మాత్రమే నేడు ఉత్పత్తి కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నారు. వారికి అవసరమైన విద్యా సౌకర్యాలు నేడు లభించడం లేదు. కాగా విద్యావంతులమని చెప్పుకునే కొందరు కార్మిక కర్షకులపై పెత్తనం చేస్తూ భూస్వాముల, పెట్టుబడిదారుల ప్రయోజనాలకు పరిరక్షకులుగా ఉన్నారు. క్రమంగా వారు జాతీయ జీవనంలో ప్రధాన భాగస్వాములుగ, పీడితులకు పీడకులకు మధ్య ఒక భాగంగా తయారయ్యారు. వారు తమ స్థానాన్ని స్థిరపచుకోటానికి పైతరగతుల వారిని పరిరక్షించే క్రొత్తసిద్ధాంతాన్ని ప్రవేశపెడుతున్నారు. ఆ విధంగా వీరిలో చాలాభాగం దోపిడీదారులకు ఉపయోగ పడుతున్నారు. ఫలితంగా అక్షరాస్యులకు నిరక్షరాస్యులకుమధ్య, విద్యావంతులకు ఉత్పత్తిదాతలైన శ్రమజీవులకు మధ్య విభేదాలు సృష్టించబడుతున్నాయి. దోపిడీవర్గం వారు ఆ విభేదాన్ని మరింతగా తమ వర్గ ప్రయోజనాలకు ఉపయోగించుకొంటున్నారు. మనం ఆశించే నూతన విద్యా విధానం కష్టజీవులకు విద్యావంతులకు మధ్య వున్న ఈ విభేదాల్ని, వేర్పాటుల్ని తొలగించేదిగా ఉండాలి శ్రమజీవులకు సేవజేయుటానికి, వారిని అభివృద్ధిపరచటానికి వీలుగా దాన్ని రూపొందించాలి.

అభివృద్ధిని కాంక్షించే విద్యా విధానం పరిపూర్ణ మానవుల్ని తయారుచేసే సాధనంకావాలి. సమాజాన్ని విషకలుషితం చేస్తున్న దోపిడీ వ్యవస్థను, అది సృష్టించిన దారిద్ర్యాన్ని, నిరుద్యోగాన్ని, నిరాశా నిస్పృహల్ని వాటి మూల కారణాల్ని తెలుసుకొనే విధానంగా ఉండాలి సాంఘికావసరాల్ని తీర్చేదిగా ఉండాలి. ఉత్పత్తితో ముడివడి ఉండేదిగా, బాలబాలికలందరికి అందుబాటులో ఉండేట్టుగా రూపొందించాలి. పీడకుల ప్రయోజనాల్ని గాక పీడితుల ప్రయోజనాల్ని రక్షించేదిగా సవరించబడాలి. పై సత్యాల్ని దృష్టిలో ఉంచుకొని నూతన విద్యా విధానానికి మార్గదర్శిక సూత్రాల్ని వివరిస్తాను.

1. ప్రతి వ్యక్తికీ విద్యా హక్కు, పనిహక్కు ఉండాలి.

2. విద్య కేవలం తెలివితేటల్ని పెంచేదిగా గాక ఉత్పత్తితోను, సాంకేతిక శిక్షణా పరిజ్ఞానంతోను సంబంధం గలదిగా ఉండాలి.

3 సాంకేతిక శిక్షణ అంటే అలవాటు ప్రకారం కొన్ని ఉత్పత్తి నైపుణ్యాల్ని తెలుసుకోవటం, ఉత్పత్తి విధానంగూర్చి వల్లెవేయటం మాత్రంకాదు. అన్ని వృత్తులకు చెందిన పరికరాల్ని ఉపయోగిస్తూ, ఉత్పత్తి కార్యక్రమాల్లో స్వయంగా పాల్గొనేదిగా ఉండాలి.

4. సామాజిక అవసరాలకు, వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా అధ్యయన పద్ధతులు మారాలి.

విద్యా విధానాన్ని ఒక కట్టడంతో పోల్చినపుడు పునాది విద్య ప్రాథమికవిద్య అవుతుంది. దాన్ని సరిదిద్దందే దానిపైన నిర్మించే సెకండరీ, ఉన్నత విద్యాదశలు ప్రయోజనకరాలు కాలేవు. కాని ప్రస్తుతం పునాదులకు బదులుగా పై అంతస్తులకే ప్రాధాన్యత ఇవ్వబడుతున్నది. విద్యాబడ్జెట్ చూస్తే ప్రాథమిక విద్యకంటే 10 రెట్లు అధికంగా ఉన్నత విద్యకు కేటా యిస్తున్నారు. అలాగాక ప్రాథమిక, సెకండరీ, ఉన్నత విద్యలకు 3:2:1 నిష్పత్తులలో కేటాయింపులు జరిగినపుడే అభివృద్ధి సాధ్యమవుతుంది. కేంద్రప్రభుత్వం మొత్తం బడ్జెట్‌లో 2 శాతం మాత్రమే విద్యకు కేటా యిస్తున్నది. వెంటనే దాన్ని 10 శాతంగా పెంచాలి.

భారత రాజ్యాంగంలో మార్గదర్శిక సూత్రాల్లో చెప్పబడినట్లు విద్య 14 సం.ల వయసుగల బాలబాలికలందరికి ఉచితంగా, సార్వజనీనకంగా, నిర్బంధంగా బోధించాలి. ఈ నాటికి దేశంలో 70 శాతం ప్రజలు నిరక్షరాస్యులుగా వున్నారు. బడి యీడుగల పిల్లలందర్నీ బడుల్లో వచ్చేట్టు చేయటంద్వారా, వయోజన విద్యాప్రచారంయుద్ధప్రాతిపదికపై నిర్వహించటంద్వారా, మాతృభాషల్ని బోధనా భాషలుగా చేయటంద్వారా మనం ఈ నిరక్షరాస్యతను నిర్మూలించగలం.

ప్రాథమిక దశలో అక్షర జ్ఞానం, సంజ్ఞాపరిజ్ఞానాలకు హెచ్చు ప్రాధాన్యత వుండాలి. కళలకు, వ్యాయామ విద్యకు అవకాశం వుండాలి. స్పెషలైజేషన్ ఈ దశలో పనికిరాదు.

సెకండరీ దశలో విషయ పరిజ్ఞానంతోపాటు అనేక వృత్తివిద్యల్ని బోధించేదిగా వుండాలి. అది ఆధునిక శాస్త్రీయ ప్రాతిపదికపై, ఉత్పత్తివిధానానికి సాంఘిక అభివృద్ధికిసంబంధం కలిగివుండాలి ఉన్నతదశలో సాంఘిక ఆర్థిక పరిస్థితుల్ని ఆలోచిస్తూ ప్రత్యక్షానుభవంద్వారా సామాజికాభివృద్ధికితోడ్పడేట్టు రూపొందించాలి.

ఒక్కమాటలో చెప్పాలంటే ఈ నూతన విద్యావిధానం భావితరాల్లో నూతనోత్తేజాన్ని శాస్త్రీయ, ప్రజాస్వామిక దేశభక్తియుత దృక్పథాల్ని ప్రేరేపించేదిగా వుండాలి.

ఫోన్ 558 పి.పి.

శ్రీ విశ్వనాథ క్లాత్ అండ్ బలియన్ మర్చంట్స్

హెడ్డాఫీస్ : ఏలూరు — బ్రాంచి : ద్వారపూడి

ప్రొప్రయిటర్స్: యర్రా మరిడయ్య అండ్ కో..

హోల్ సేల్ క్లాత్ మర్చంట్స్

# ఖమ్మం మహాసభల్ని నిర్వహించిన వివిధ కమిటీలు

**ఆర్థిక కమిటీ:** సర్వశ్రీ ఎ. వెంకటస్వామి, యమ్. వెంకటరత్నం, జి. లక్ష్మయ్య.

**ప్రెస్ కమిటీ:** సర్వశ్రీ పి.వి. సుబ్బరాజు, యం. నరహరి, జి శ్రీరామమూర్తి, యం. కోటయ్య, జి. చిట్టెయ్య.

**ప్రచార సంఘం:** సర్వశ్రీ సి. హెచ్. రాజారావు, బి. సుబ్బరాజు, బోస్

**ఆహార కమిటీ:** సర్వశ్రీ ఆర్. రాఘవయ్య, డి. రామచంద్రయ్య, యస్. జానకి రామారావు, వి. నరసయ్య, కె. శ్రీనివాసులు.

**రిసెప్షన్ కమిటీ:** సర్వశ్రీ వై. రాధాకృష్ణమూర్తి, కె. నారాయణరావు, పి. రవికుమార్, ఆర్. శ్రీరాములు, పి. సత్యనారాయణ (నల్గొండ)

**డెలిగేట్స్ కమిటీ :** సర్వశ్రీ ఆర్. పురుషోత్తం రావు, యస్. అనంతకుమార్, వి. శ్రీరామమూర్తి, కె. నారాయణరావు (గుంటూరు), టి కొండాచారి, టి. అంజిరెడ్డి.

**డెకరేషన్ కమిటీ :** సర్వశ్రీ వి. మల్లికార్జున రావు, సి. సుదర్శనశాస్త్రి కె. రామిరెడ్డి (వరంగల్), పి. నాగేశ్వరరావు (గుంటూరు)

**నీటి సరఫరా కమిటీ :** సర్వశ్రీ వి యల్. నరసింహారావు, యస్. గోపాలరావు, సి. హెచ్. రోశయ్య, ప్రకాశరావు, యన్. సత్యనారాయణ.

**వలంటీరు కమిటీ :** సర్వశ్రీ సి. హెచ్. రాజారావు, కె. కృష్ణయ్య, టి. అంజిరెడ్డి, డి. వి. కె. పి. ప్రసాద్, జి. లోహిదాస్.

**సాంస్కృతిక సంఘం :** సర్వశ్రీ యల్. రామకోటేశ్వరరావు, గంగిసెట్టి, ఆర్. ప్రకాశరావు, పి. సాంబయ్య, కె. సూర్యనారాయణరాజు, ఎ. బాబూరావు.

**వైద్యసహాయక సంఘం:** సర్వశ్రీ పి. సత్యనారాయణ (ఖమ్మం), కె. సుదర్శనరావు.

**ఊరేగింపు మరియు బహిరంగసభల కమిటీ:** సర్వశ్రీ ఆర్. పురుషోత్తమరావు, వి.యల్. నరసింహారావు, వి. సూర్యనారాయణరాజు

**వసతి సౌకర్యాల కమిటీ:** సర్వశ్రీ జి. లక్ష్మయ్య, వి. మల్లికార్జునరావు, టి. వెంకటరావు, డి. వి. సుబ్బారావు, బి. సుబ్బరాజు, విశ్వనాథరావు

**జెండా వందన నిర్వహణ కమిటీ:** సర్వశ్రీ బి. సుబ్బరాజు, హరిశ్చంద్రరావు, మురళి.

**ఎంక్వయిరీ ఆఫీసు కమిటీ:** సర్వశ్రీ పి. సాంబశివరావు, సి. హెచ్. విద్యాసాగర్.

**మహిళా ప్రతినిధుల సౌకర్యాల కమిటీ :** శ్రీమతులు బి సీతాకుమారి, యన్. భారతి, కస్తూరి, జి లలితాదేవి.



ప్రతినిధుల వసతి గృహాలవద్ద పనిచేసిన యువజన-విద్యార్థి వలంటీర్లు.



వలంటీర్ల సమన్వయ కమిటీ



మహాసభ వేదికవద్ద పనిచేసిన విద్యార్థి వలంటీర్లు

# అధ్యాపక వృత్తి

—శ్రీ వట్టికొండ రామకోటయ్య,

కొత్తగూడెం.

గురుతరంబైన మనవృత్తి
            క్రొవ్వువత్తి
అందుబాటుగు సంపత్తి
            అగరుబత్తి
మేలి గౌరవ ప్రతిపత్తి
తేలికైన బత్తెమున్న
ఉపాధ్యాయ వృత్తిగాదె!
అజ్ఞాన తమస్సులపై విజ్ఞానోషస్సులట్టె విరజిమ్మంగా
ప్రజ్ఞా దురంధరుడనై
అజ్ఞుల నందించు గురుడు, ఆదిత్యుడునై
వెలుగునందించు జ్యోతియై
వెలయునట్టి గతము తెలిసియు
ప్రస్తుత కాలమరసి
అనుభవముతోడ మించి అధ్యాపకుండు
భావితరములు బ్రతుకంగ
బాట జూపు!

---

మహాసభ సందర్భంలో శ్రీ వి. సత్యప్రసాద్, శ్రీ ఫన్నారావు కైపీష్టులుగా పనిచేసి కార్యక్రమాల దిగ్విజయానికితోడ్పడ్డారు.

—వారికి మా అభివందనాలు.

---



నవోదయ బుర్రకథ దళం.
కథకుడు: శ్రీ కె. శ్రీరాములు, హాస్యం: శ్రీ కె. గంగిసెట్టి,
వ్యాఖ్యానం: శ్రీ జి. సత్యనారాయణ

( 7 వ పేజీ తరువాయి )

7) పదవ తరగతి వృక్షశాస్త్రంలో 85వ పేజీ బొప్పాయి "ఏకలింగవృక్షం" కాని అది వాస్తవంగా "ఉభయలింగ వృక్షం". మగ బొప్పాయి చెట్లు కొన్ని మైళ్ళదూరంలో వున్నా ఆడ బొప్పాయి ఫలాలనీయటం మనకు ప్రత్యక్ష నిదర్శనం.

8) జీవశాస్త్రంలో పటాలకు చాలా ప్రాముఖ్యతవుంది. కాని పాఠ్యపుస్తకాలలో పటాలు ముద్రించేప్పుడు ఆ పటముల లోని అన్నిభాగాలు స్పష్టంగా ఉండాలి. కాని ముఖ్యమైన యీ పటాలే పాఠ్యగ్రంథాల్లో పలుచోట్ల తప్పుగా ముద్రింపబడ్డాయి.

మరి లక్షలాది విద్యార్థులు ప్రతి సంవత్సరం ఈ తప్పుడు పుస్తకాన్ని చదివి నేర్చుకొనేదేమిటి? శాస్త్ర గ్రంథాలలోనే ఇన్ని తప్పులుంటే మిగిలిన వాటి సంగతి ఇక చెప్పనక్కర లేదు. ఇప్పటికైనా వాటిని సరిదిద్ది పుస్తకాల్ని సరిగా ప్రచురించాలని కోరుతున్నాను.

## కొత్తగూడెం సమితిలో

## ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

స్థానిక శ్రీరామచంద్రా ఉన్నత పాఠశాలలో విద్యావారోత్సవాల సందర్భంగా జిల్లాలో ఉత్తమఉపాధ్యాయుడుగా ఎన్నిక చేయబడిన ఆ పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీ ఎం. రామకోటేశ్వరరావుగారిని పాఠశాల యాజమాన్యం, స్థానిక ప్రముఖులు 8-9-77న ఘనంగా సన్మానించారు.

అలాగే ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎన్నికైన శ్రీ వట్టికొండ రామకోటయ్యగార్కి వారు పనిచేస్తున్న టూలీలైన్ హైస్కూలు ఉపాధ్యాయవర్గం 8-11-77న అభినందన సభజరిపి ఘనంగా సన్మానించారు.

## చెన్నుపాటి భవననిధికి

### అపూర్వోత్సాహంతో కార్యకర్తల విరాళాలు

| | | |
|---|---|---|
| శ్రీ కె. నారాయణరావు, కనకదుర్గాంబ దంపతులు తురుమెళ్ళ, గుంటూరు జిల్లా | | రు. 116-00 |
| శ్రీ పి. నారాయణమూర్తి, భీమవరం, ప.గో. జిల్లా | | రు. 116-00 |
| శ్రీ కె గౌరీపతి | ,, | రు 116-00 |
| శ్రీ టి. బాపనయ్య | ,, | రు 116-00 |
| శ్రీ డి వి శాస్త్రి | ,, | రు. 58-00 |
| శ్రీ జి. వెంకట్రావు | ,, | రు. 58-00 |
| శ్రీ అలీఖాన్ | ,, | రు. 25-00 |
| సాయికుమారి | ,, | రు 25-00 |
| యన్. విజయలక్ష్మి | ,, | రు 20-00 |

10-00ల చొప్పున ఇచ్చిన వారితోకలిపి భీమవరం పట్టణంలో రు. 1000-00 వసూలయ్యాయి. దాతలందరికి మా అభివందనాలు!

## ఆంధ్రప్రదేశ్ శాసన మండలి
## తూర్పు-పశ్చిమ ఉపాధ్యాయ మరియు
## హైదరాబాద్, తెలంగాణా పట్టభద్రుల నియోజకవర్గ

# ఓటర్లుగా చేరండి! చేర్పించండి!!

## ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ విజ్ఞప్తి

తెలంగాణా తూర్పు - పశ్చిమ ఉపాధ్యాయ నియోజక వర్గాలకు, హైదరాబాద్, తెలంగాణా పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గాలకు 1978 జులై నెలలో ఎన్నికలు జరుగనున్నాయని ప్రభుత్వం ప్రకటించింది. ఓటర్లను చేర్పించే కార్యక్రమానికి గడువు, తేదీలు కూడా ప్రకటించబడ్డాయి.

నవంబర్ 7 వ తేదీతో ఓటర్లను చేర్పించే ప్రథమదశ గడువు పూర్తిఅవుతుంది కాన విద్యాసంస్థలలోని ఉపాధ్యాయులందరు నిర్ణయింపబడిన దరఖాస్తు ఫారాలు పూర్తిచేసి, తూర్పు తెలంగాణా ఉపాధ్యాయ, తెలంగాణా పట్టభద్రుల నియోజక వర్గానికి చెందినవారు వరంగల్ జిల్లా కలెక్టర్ పి. ఎ గారికి పశ్చిమ తెలంగాణా ఉపాధ్యాయ, హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గానికి చెందినవారు హైదరాబాద్ కలెక్టరు పి. ఎ. గార్కి పంపి ఓటర్లుగా నమోదుకావాల్సి ఉంటుంది.

1. క్వాలిఫైడ్, అన్ క్వాలిఫైడ్, పర్మనెంట్, టెంపరరీ, బ్రేకులతో గాని, బ్రేకులు లేకుండా గాని 1-11-71 నుండి 1-11-77 మధ్యకాలంలో 3 సం.ల సర్వీసు గలిగిన సెకండరీ, కాలేజీ, యూనివర్శిటీ, పాలిటెక్నిక్, పారిశ్రామిక శిక్షణా కేంద్రాలు, ట్రైనింగు కాలేజి కళాశాల మున్నగు సంస్థలలో, అన్ని మేనేజిమెంట్లలో పనిచేయు ఉపాధ్యాయులు ఉపాధ్యాయ నియోజక వర్గాలలో ఓటర్లుగా చేరుటకు అర్హులు.

2. 1-11-77 నాటికి ఓటరుగా నమోదగు పట్టభద్రుల నియోజకవర్గ ప్రాంతాలలో 3 సం.లు నివాసము గల్గి 1-11-77 నాటికి డిగ్రీ పరీక్షా ఫలితాలు ప్రకటించిన తేదీనుండి మూడు సంవత్సరాలు పూర్తియగు పట్టభద్రులందరు పట్టభద్రుల నియోజకవర్గాలలో ఓటర్లుగా చేరుటకు అర్హులు.

— వెంటనే ఓటర్లుగా నమోదుకండి !

— ఉపాధ్యాయ సంఘాల కృషిని శాసన మండలిలో కూడా ప్రతిధ్వనింపజేయగల సరియైన ప్రతినిధిని ఎన్నుకొనుటకు వచ్చిన యీ సదవకాశాన్ని వినియోగించుకోండి !

— కార్యకర్తలారా! వెంటనే కదిలి నిర్ణీత ఫారాల్ని ఉపాధ్యాయులకు అందించి ఓటర్లుగా నమోదు కావటానికి తోడ్పడండి!

## ఖమ్మంజిల్లా పరిషత్‌లో సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయ సంఘాల సమిష్టికృషి విజయం

ఖమ్మంజిల్లా పరిషత్ స్పెషల్ ఆఫీసర్ సెప్టెంబర్ నెలలో కూడా ప్రభుత్వ జి.ఓ. ప్రకారం మ్యూచువల్ మరియు రిక్వెస్టు బదిలీలు చేయటం జరుపలేదు. దానిపై జిల్లాలోని వివిధ సంఘాలను సమీకరించి, ఐక్య ఉద్యమంద్వారా ప్రభుత్వ ఉత్తర్వు అమలు జరిపించుకుటకై జిల్లా యు. టి. యఫ్. కార్యక్రమంలో కలిసి రావల్సిందిగా యన్.టి.యు., పి.ఆర్.టి.యు సంఘాల వారికి లెటర్స్ పెట్టి, వారితో కలిసి సంయుక్తంగా 4-10-77 న కలెక్టర్‌గారిని రిప్రజెంట్ చేయటం జరిగింది. జిల్లా కలెక్టర్ గారి సూచన ప్రకారం 13-10-77 న జడ్. పి. కార్యదర్శి, ఎడ్యుకేషన్ ఆఫీసర్ల గార్లతో చర్చలు జరపటం జరిగింది. వారు జి. ఓ.ను అమలు జరుపుటకు అంగీకరించి ఆ మేరకు 25-10-77 లోగా పూర్తి చేస్తామని ప్రతినిధి వర్గానికి హామీ యిచ్చారు. ఇది ఎంతో ఆతురతతో ఎదురుచూస్తున్న ఉపాధ్యాయ వర్గానికి సంఘాల సమిష్టి కృషి వలన సాధించిన ప్రథమ విజయం. యు.టి.యఫ్. తరపున శ్రీ వి. మల్లికార్జునరావు, ఎన్.టి.యు. తరపున శ్రీ కె. బుచ్చిరామయ్య, శ్రీ బి. రాఘవరెడ్డి పి.ఆర్.టి.యు. తరపున శ్రీ కాసిం, ఎల్. సత్యనారాయణరెడ్డి సమిష్టిగా పై ప్రతినిధి వర్గంలో పాల్గొన్నారు.

## పెనుగొండ సమితిలో ఆమరణ నిరాహారదీక్ష

### వ్యతిరేక ప్రచారకుల ఆటకట్టు

అనంతపురం జిల్లా పెనుగొండ సమితిలో అక్రమబదిలీలు సరిదిద్దాలని సమితి అధికారులతో జరిపిన రాయబారాలు విఫలంకాగా 2-10-77న జిల్లా యు.టి.యఫ్ ప్రధానకార్యదర్శి శ్రీ బి. వెంకటసుబ్బయ్య, సమితి సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ బి. సుబ్బరాయుడు 2-10-77 న ఆమరణ నిరాహారదీక్ష పూనేరు. సంఘ విచ్ఛిన్నకులు కరపత్రాలు వేసినా సమితి వారిచ్చిన జీపులో ఊరూరు తిరిగి వ్యతిరేక ప్రచారం చేసినా ఉపాధ్యాయుల, ప్రజాసంఘాల ఆందోళనవలన మూడవరోజుకు మేనేజిమెంటు దిగిరాక తప్పలేదు. మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీ నరిసిరెడ్డి, సి. ఓబిరెడ్డి, ఆర్. నాగిరెడ్డి మొదలగు పెద్దలు కమిటీగా ఏర్పడి బదిలీలు సరిదిద్దే హామీ యిస్తూ నిరాహార దీక్ష విరమింపజేయుటం జరిగింది.

**గంట్యాడ సమితిశాఖ:** విశాఖజిల్లా గంట్యాడ సమితి యు టి యఫ్ కార్యవర్గ సమావేశం జిల్లాశాఖ ఉపాధ్యక్షుడు శ్రీ జె. అప్పలనాయుడుగారి అధ్యక్షతన బుడదపాడులో జరిగింది. ప్రధానకార్యదర్శి శ్రీ బెహరా సత్యనారాయణ కృషి రిపోర్టు సమర్పించారు. అధ్యక్షులు శ్రీ డి యన్. యన్. రాజు సంఘ పటిష్ఠతను గురించి వివరించారు. సంఘ ఆర్థిక పుష్టికి పిలుపుయివ్వగా అక్కడికక్కడ సభ్యులనుండి రు. 121/-లు విరాళం వచ్చింది.

పిదప కంటెంజెన్సీ కనీసం రు. 10/-లు ఇవ్వాలని ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 1:25కి తగ్గించాలని వినోద విజ్ఞాన యాత్రలకు వెళ్ళే టీచర్లకు ఆర్. టి సి కన్సెషన్ సౌకర్యం కలుగజేయాలని, వివాహాలకూ పండుగలకు ఇచ్చే అడ్వాన్సులు ప్రభుత్వ గ్రాంటులనుండి ఇప్పించాలని, ఉపాధ్యాయులకు సరెండర్ లీవ్ సౌకర్యం కల్పించాలనీ, నెలాఖరున జీతాలు మార్చుకోటానికి వీలుగా పోస్టుడేటెడ్ చెక్కులు ఇప్పించాలని వివిధ తీర్మానాలు చేశారు. శ్రీ టి వి యమ్. శర్మగారి వందన సమర్పణతో సమావేశం ముగిసింది.

## రాజధానిలో యు. టి. యఫ్. చే ఉపాధ్యాయుల సమస్యలపై రాయబారాలు

ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ పక్షాన హైద్రాబాదులో వివిధ అధికారులనుకలిసి మెమొరాండములు యిచ్చి ఉపాధ్యాయుల సమస్యలపై 77 అక్టోబరు 12,13,14,15 తేదీలలో రాయబారములు జరుపుట జరిగింది. విద్యాశాఖ కార్యదర్శి, పాఠశాల విద్యడైరెక్టరు, పంచాయితీరాజ్ కార్యదర్శి మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టరు, పరీక్షలకమీషనరు, అకౌంటు జనరల్ మొ॥ వారికి సమస్యలపై మెమొరాండములు ఇవ్వటం జరిగింది.

కోర్టు తీర్పుల ప్రకారం రిటయిరుమెంటు వయస్సు 60 సంవత్సరాలుగా పెంచాలని, ఎలిమెంటరీ సెక్షన్‌లోనున్న వారిని ఇతర కేటగిరిలోనున్న ఇన్ సర్వీసు బి.ఇ.డి. లను అప్‌గ్రేడు చేయాలని, అదనపు యింక్రిమెంట్లు హయ్యరుగ్రేడు, గ్రేడు II పండిట్స్, పి.ఇ.టి, క్రాఫ్టు, ఆర్టు వుపాధ్యాయులకు కూడా యివ్వాలని, నాన్ గవర్నమెంటు ఉపాధ్యాయులకు సరెండరులీవు సౌకర్యం యివ్వాలని, పండిట్స్ ఇతర కేడరు ఉపాధ్యాయులకు 1974 నుండి సెలక్షన్‌గ్రేడు పోస్టులు విడుదల చేయాలని పాఠశాలల్లో టార్గెట్ నిర్ణయం వెంటనే రద్దుచేయాలని, ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి వెంటనే తగ్గించాలని, సెమినార్ క్లాసుల నిర్వహణకు అలవెన్సులు యివ్వాలని, ఇ.యల్.టి.సి. ట్రయినింగువారికి యిచ్చుచున్న అలవెన్సులు పెంచాలని, ఎయిడెడ్ ఉపాధ్యాయులకు టీచింగ్‌గ్రాంట్లు సకాలములో విడుదల చేయాలని, మునిసిపల్ ఉపాధ్యాయుల టీచింగ్‌గ్రాంట్లు సకాలములో విడుదల చేయాలని, భీమవరం మునిసిపాలిటీలో కండెక్టెన్‌ల కంటిన్యూ ఉత్తర్వులు యివ్వాలని, పటమట వయోజన విద్యాకేంద్రముతో శిక్షణ పొందుచున్న వారి అలవెన్సులు పెంచి భౌతిక పరిస్థితులు మెరుగుపరచాలని, ఎయిడెడ్ ఉపాధ్యాయులకు 1044 జి. వో ప్రకారం 1958 నుండి జీత నిర్ణయములు చేయాలని, విజయవాడ చిట్టినగర్ ఉపాధ్యాయులకు వెంటనే జీతములు చెల్లించి ఉపాధ్యాయులకు న్యాయము కల్గించాలని, టి.యస్.యల్.సి సెకండరీ పరీక్షలకుమరో రెండు అవకాశములు యివ్వాలని, సోషలు వెల్‌ఫేరు ఉపాధ్యాయుల స్టేటస్, కేర్ కంటిన్‌జెన్సీలు వెంటనే యిచ్చు ఉత్తర్వుయివ్వాలని, కోఆర్డినేషన్ సమావేశాల నిర్వహణలో పాలకొల్లు మునిసిపల్ కమీషనరు అక్రమచర్యలు అరికట్టాలని, రిటయిరయిన ఉపాధ్యాయులకు పెన్షను గ్రాట్యూటీ సకాలంలో యివ్వాలని, 76 అక్టోబరులోను, ఇటీవల పెంచిన కరువుభత్యం ఉపాధ్యాయులకు వెంటనే చెల్లించాలని మినిమం పెన్షన్ రూ. 45/- అందరు రిటయిరు ఉపాధ్యాయులకు చెల్లించాలని జనరలు సమస్యలపై మెమొరాండములు యిచ్చుట జరిగింది. అలాగే వ్యక్తిగత సమస్యలపైకూడా మెమొరాండములు యిచ్చుట జరిగింది. తుని మునిసిపాలిటీలో శ్రీ పి. వెంకటరావు రికవరి నిలుపుదల చేయాలని, ముమ్మిడివరం సమితిలో శ్రీ జె భాస్కరరావు బ్రేక్‌పిరియడు అన్‌డ్యూటీగా ఇవ్వాలని రాజోలు సమితిలో 23 మంది బ్రేక్ పిరియడుపై జీతములు చెల్లించు ఉత్తర్వు యివ్వాలని, విశాఖ జిల్లా నక్కపల్లి సమితి ఉపాధ్యాయుడు పి. పైడిరాజు అప్‌గ్రేడు విషయమై వెంటనే ఉత్తర్వులు యివ్వాలని, ఖమ్మం జిల్లా పరిషత్‌లో ఇన్ సర్వీసు పి. ఓ టి. శ్రీ జి. మురళి సీనియారిటీ ఉల్లంఘించి ఇతరులకు యిచ్చినవిషయం పరిశీలించాలని, వారికి న్యాయం కల్గించాలని శ్రీ పి. కనికేశ్వరుడు హింది పండిట్ విషయం వెంటనే పరిశీలించి న్యాయం కల్గించాలని గ్రంథాలయ సంస్థ ఉద్యోగులకు కుటుంబనియంత్రణ ప్రోత్సాహక యింక్రిమెంట్లు యివ్వాలని కోరుకొల్లు పాఠశాల ఉపాధ్యాయుల న్యాయమైన కోర్కెలు వెంటనే నెరవేర్చాలని, శ్రీ పి వి. సత్యనారాయణమూర్తికి వెంటనే పోస్టింగు ఆర్డరు ఇవ్వాలని, మొదలగు అనేక సమస్యలపై విజ్ఞప్తులు యిచ్చి అధికారులలో చర్చించటం జరిగింది.

రిటయిరుమెంటు వయసు పెంపుదలపైనను, ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి తగ్గించుటపైనను, టార్గెట్లురద్దుపైనను, గ్రేడు II పండితులకు ఇతరులకు అడ్వాన్సు యింక్రిమెంట్లుపైనను, సరెండరులీవు, సెలక్షన్ గ్రేడులుపైనను, గ్రాంటు విడుదల పైనను, మిగిలిన ఇతర విషయములపై వెంటనే నిర్ణయాలు తీసుకొని ఉత్తర్వులు యిస్తామని, మిగిలిన అన్నిసమస్యలు పరిశీలించి తగునిర్ణయాలు తీసుకొంటామని తెల్పిరి.

అలాగే మహాసభ ఆమోదించిన తీర్మానాలు అధికారులకు అందించి చర్చించుట జరిగింది.

రాయబార వర్గములో శ్రీ ఎ. వెంకటస్వామి (ప్రధాన కార్యదర్శి) శ్రీ యం. నరహరి (కార్యదర్శి) గారలు కలరు, శ్రీ యం. జె. మాణిక్యారావు యం. యల్. సి.గారు రాయబారాలలో చర్చలలో తోడ్పడ్డారు.



ఖమ్మం మహాసభల ఫొటోల్ని తీసిన
శ్రీ పి. నాగేశ్వరరావు, ఈమని, గుంటూరు జిల్లా
(ఐక్యఉపాధ్యాయ, కార్టూనిస్టు)

---

### ప్రతి హైస్కూలుకు 50 కి.ల పంచదార

సాధన: యు.టి.యఫ్.తరపున ఖమ్మంతాలూకాతహసీల్దారును రిప్రజెంట్ చేసి ఖమ్మం, తిరుమలాయపాలెం సమితులలోని హైస్కూళ్ళకు 50 కి.ల చొప్పున పంచదార ఇచ్చుటకు, ఆ విధంగా డీలర్లనుండి పొందుటకు అంగీకరింపజేయటం జరిగింది.

# కలెక్టర్ ఆఫీసుఎదుట అక్టోబరు 14న 400మంది టీచర్ల ధర్నా

## ప్రకాశంజిల్లా ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి అధ్వర్యాన

దీర్ఘ కాలంగా జిల్లాలోని ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరింపబడనందున, ప్రకాశం జిల్లాలోని మూడు ఉపాధ్యాయ సంఘాలు (ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్, టీచర్స్ ఫెడరేషన్, ఎలిమెంటరీ టీచర్స్ ఫెడరేషన్) సంయుక్త కార్యాచరణ సమితిగా ఏర్పడి అంచెలవారీ పోరాట కార్యక్రమం సాగిస్తున్నవి. దానిలో భాగంగా 29-9-77న జిల్లాలోని అన్ని పాఠశాలల్లో నల్లబ్యాడ్జీలు ధరించి 6వేలమంది టీచర్లు నిరసన దినం జరిపారు. 30-9-77నుండి 6-10-77వరకు వారంరోజులపాటు అన్ని పాఠశాలల్లోను కోర్కెలపై తీర్మానాలుచేసి దాదాపు 2వేలకోర్టు కార్డులు పోస్టుచేశారు. శ్రీ జిల్లా కలెక్టర్ చొరవదీసుకొని 3-10-77న శ్రీ యమ్. జె మాణిక్యాలరావు అధ్వర్యాన హాజరైన ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో సమన్వయ సమావేశం జరిపారు. ఫలితంగా కొన్ని జడ్ పి. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోబడ్డాయి.

కాని జిల్లా విద్యా శాఖాధికారిణి మాత్రం మొండి వైఖరి అవలంబించి ధర్నా నోటీసుకు జవాబివ్వకపోగా, వారి వద్దకు వెళ్ళిన ఉపాధ్యాయుల్ని తూలనాడటం, బెదిరించటం పరిపాటయింది. ఎన్నో పెండింగ్ సమస్యలు ఆమె ఆఫీసులో పేరుకుపోయి గుట్టలుపడి ఉండటంవలన ముఖ్యంగా ఎయిడెడ్ టీచర్లు, పెన్షనర్లు ఎంతోబాధపడుతున్నారు. ఇక గత్యంతరం లేనిస్థితిలో వారి నిర్లక్ష్యవైఖరికి నిరసనగా 14-10-77న ధర్నా, 15-10-77 నుండి రిలే నిరాహారదీక్షలు జరపటానికి సంయుక్త కార్యాచరణ సమితి నిర్ణయించింది.

ఆ విధంగానే 14-10-77న జిల్లాకలెక్టర్, డి. ఇ. ఓ. ఆఫీసుల ఎదుట 400 మంది టీచర్లు ధర్నాజరిపి తమకోర్కెల్ని ఎలుగెత్తి చాటారు. ఆ సందర్భంలో జరిగిన ధర్నా శిబిర ప్రారంభోత్సవ సభకు శ్రీ డి. రామిరెడ్డి (కార్యాచరణ సమితి అధ్యక్షుడు) అధ్యక్షత వహించారు శ్రీయుతులు మైనేని వెంకటరత్నం (యు.టి యఫ్.) సింగరాజు రామకృష్ణయ్య (ఎ.పి. టి.యఫ్.) పి. శామ్యూల్ (ఎ.పి యు టి.యఫ్.) జె అంజయ్య (యన్.యఫ్.ఐ) భాస్కరరావు (ఎ.పి టి యు.) పి. కోటయ్య (సి ఐ.టి.యు.) జి లక్ష్మయ్య (జిల్లా ట్రేడ్‌యూనియన్స్) పూర్ణచంద్రరావు (యన్.జి.ఓ. అసోసియేషన్) మొదలగు ప్రజాసంఘాల ప్రతినిధులు సంఘీభావాన్ని వెల్లడిస్తూ ప్రసంగించారు. శ్రీ ఆర్. సీతారామారావు (శక్రటరీ, కార్యాచరణ సమితి) తమకోర్కెల్ని బలపరిచిన వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులకు అభివందనలు తెల్పారు. వర్షం వచ్చినా ఉపాధ్యాయులు కడకంటా పట్టుదలతో ధర్నా సాగించారు. పిదప 15, 16, 17 తేదీలతో రిలేనిరాహార దీక్షలు సాగాయి.

### ఖమ్మం మహాసభల్లో ప్రథమ బహుమతి పొందిన నాటిక



'పెండింగ్ ఫైలు' నాటికలో దృశ్యం.



ఖమ్మం మహాసభల ఫొటోల్ని తీసిన శ్రీ సి హెచ్. సత్యనారాయణ, విజయా ఫొటోస్టూడియో అమలాపురం

### ద్వితీయ బహుమతి పొందిన నాటిక



'మానవుడు' నాటికలో దృశ్యం.



## ఉపాధ్యాయ - విద్యార్థి నిష్పత్తి తగ్గించాలి

### యు.టి.యఫ్. రాష్ట్ర కమిటీ డిమాండ్

పాఠశాలల విద్యాభివృద్ధికి తీవ్ర ఆటంకమైన ప్రభుత్వం పెంచిన ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి ఉత్తర్వులు వెంటనే ఉపసంహరించుకోవాలని సెప్టెంబరు 10వ తేదీన ఇక్కడ జరిగిన ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం డిమాండ్ చేసింది.

అతిదారుణమైన ఈ ఉత్తర్వును ఉపసంహరించుకోకపోతే పోరాట రూపం తీసుకోక తప్పదని కార్యవర్గం హెచ్చరించింది

సమావేశానికి శ్రీ కె. నారాయణరావుగారు అధ్యక్షత వహించారు. శ్రీ ఎ. వెంకటుస్వామి కార్యదర్శి నివేదిక, శ్రీ మైనేని వెంకటురత్నం పత్రికా నివేదికను, శ్రీ డి. రామిరెడ్డి సభ్యత్వ కాంపెయిన్‌పైనా, శ్రీ జి. లక్ష్మయ్య మహాసభ జమా ఖర్చులపైనా, శ్రీ యన్. సీతారామాచారి భవననిధిపైన నివేదికలను ప్రవేశ పెట్టారు. నివేదికలమీద చర్చ జరిగిన అనంతరం సభ్యులు వాటిని ఆమోదించారు.

ముప్పైవేల సభ్యత్వము చేర్పించాలనీ, రెండువేల పత్రికా చందాలు చేర్పించాలనీ, చెన్నుపాటి భవననిధికి 50 వేలు వసూలు చేయాలని నిర్ణయించారు. సమావేశం ప్రారంభంలో ఇటీవల అకాలమృతి చెందిన కృష్ణాజిల్లా ముస్తాబాద్ ఉపాధ్యాయుడు శ్రీ ఎ. రామకోటేశ్వరరావు సానుభూతి వెల్లడిస్తూ మౌనం పాటించారు. అక్రమ బదిలీలను వెంటనే సరిచేయాలనీ, లేని పక్షంలో ప్రత్యక్షచర్య తప్పదనీ సర్వీసు బి.యి డి ల ప్రమోషన్ ఉత్తర్వులోని లోపాలు తొలగించాలనీ, కంపల్సరీ డిపాజిట్ రెండవ వాయిదా వెంటనే చెల్లించాలనీ కోరుతూ కార్యవర్గం తీర్మానించింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జి. ఓ. యం, యస్. నెం. 812 తేదీ 9-8-77 ప్రకారం ప్రాథమిక పాఠశాలలలో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 1:50 పెంచటం జరిగింది. విద్యాభివృద్ధికి గొడ్డలి పెట్టయిన యిట్టి ఉత్తర్వు ఇవ్వటం దారుణం.

తమిళనాడు మొదలగు రాష్ట్రాలలో 1 20 గాను ఇతర వర్ధమాన దేశాలలో 1:10 గాను ఉన్నదానిని రాష్ట్రప్రభుత్వం 1:50 గా చేయుట మతిమాలిన చర్య. ఒక ఉపాధ్యాయుడు ప్రాథమిక పాఠశాలలలో పదిమంది పిల్లలకు మించి చదువు చెప్పటం సాధ్యంగాదని విద్యావేత్తలు ఒకవైపు ఉద్ఘాటిస్తూ ఉండగా రాష్ట్ర ప్రభుత్వం దాన్ని పట్టించుకోక యిలా పెంచుకొంటూ పోవటం... ఏ లాభం ఆశించో అర్థంగావటంలేదు.

ప్రభుత్వపు యీ చర్య విద్యాభివృద్ధికి భంగకరమే గాకుండా, రిట్రెంచ్‌మెంట్‌కు దారితీసి ఉన్న ఉద్యోగాలు ఊడే ప్రమాదముంది. నిరుద్యోగ నిర్మూలన చేస్తామన్న ప్రమాణాలు విద్యారంగంలో కొత్తపోష్టులు సృష్టించి ఉద్యోగావకాశాలు కల్పించాల్సిందిపోయి ఉన్నవాటిని ఊడగొట్టటం చూస్తూంటే మాటలుతప్ప చేతలు ఈ ప్రభుత్వానికిష్టముండదని విదితమౌతున్నది.

ప్రాథమిక పాఠశాలల్లో 1:20గా, హైస్కూళ్ళలో 1:30 గా ఏజన్సీలలో 1;10 గా ఉండాలని ఒకవైపు ఆందోళనచేస్తుండగా ఈ ప్రభుత్వచర్య మతిమాలినదిగా కన్పిస్తూఉంది

అలాగే హైస్కూళ్ళలో టార్జట్లు ఫిక్స్‌చేసి పరీక్షా ఫలితాలు తగ్గటానికి ఉపాధ్యాయులే కారణమని, వారిని శిక్షింపబూనటం మరింత అన్యాయం. వెంటనే ప్రభుత్వం ఈ ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని, అందుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యారంగ శ్రేయోభిలాషులు ఆందోళన ద్వారా ప్రభుత్వాన్ని వెనుకడుగు వేయించాలని రాష్ట్రకమిటీ విజ్ఞప్తి చేస్తున్నది.

## మరోసారి ప్రభుత్వ వాగ్దాన భంగం

### ఇన్‌సర్వీస్ టీచర్ల ప్రమోషన్ ఆర్డర్లలో అవకతవకలు

ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జి.ఓ.యం.యస్. నెం. 886 (విద్య) తేదీ 25-8-75 ఉత్తర్వు విడుదల చేసింది. దాని ప్రకారం అప్పర్ ప్రైమరీ, ఉన్నత పాఠశాలల్లో పనిచేసే సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు 21-1-76 నాటికి బి. ఇ. డి. అర్హత పొందిన వారైతే వారందరూ అప్‌గ్రేడ్ చేయబడతారు.

ఇది కేవలం 7-4-77 న ముఖ్య మంత్రి ఉపాధ్యాయ ప్రతినిధులతో అంగీకారానికి వచ్చిన ఒడంబడికకు విరుద్ధం పైగా అది వాగ్దాన భంగంకూడా. ఆనాటి ఒడంబడిక ప్రకారం 1-4-77నాటికి బి.ఇడి. అర్హతగల్గి సెకండరీపోస్టులలో పనిచేస్తున్న వారందరినీ అప్‌గ్రేడ్ చేయవలసివున్నది. నాటి ఉత్తర్వు ప్రకారం 21-1-76 నాటికే వర్తింప జేయటం చాలామందికి అనగా 1-4-77 లోపున్న బి.ఇడి. అర్హతపొందిన వారికి ఉద్దేశ్య పూర్వకంగా నష్టం కల్గించటమే. వారికిప్పట్లో ప్రమోషన్లు సున్నకుసున్న, హళ్ళికి హళ్ళి.

పైగా ఈ ఉత్తర్వు ప్రైమరీ స్కూళ్ళలో పనిచేసేవారికి సెకండరీ గ్రేడులుకాని ఇతర కేటగిరీలవారికి, జె.డి.ఐలకు వర్తింపక పోవటం దారుణం. ఈవిధమైన వివక్ష చూపటంలో ప్రభుత్వం యొక్క ఉద్దేశ్యం ఏమిటో అనూహ్యంగా ఉంది. ఏ మాత్రం సహింపరానిదిగాఉంది. సర్వీసులో పనిచేస్తున్నవారు అదనపు అర్హతలు సంపాదించుకోటానికి తమకున్న జ్ఞానాన్ని మరింత అభివృద్ధి పరచుకోటానికి, అర్హతల్నిబట్టి స్కేలు యివ్వాలని కొఠారి కమిషన్ చేసిన సిఫార్సుకే ఇది విరుద్ధంగాఉంది.

పైగా విధింపబడిన షరతులు కూడా చాలా నష్టదాయకంగా వున్నాయి. అప్‌గ్రేడ్ చేయబడిన పోస్టులను కొత్తగా సృష్టింపబడే బి.యి.డి పోష్టులతో సరిపుచ్చటమంటే మరి కొన్నేళ్ళ పర్యంతం కొత్తగా కాలేజీనుండి బి.యి.డి అర్హత సంపాదించినవారికి ఉద్యోగావకాశాల్ని నిషిద్ధం చేయడంతప్ప వేరుగాదు. ఇప్పుడు అప్‌గ్రేడ్ చేయబడిన పోష్టులను గూడా అవి ఖాళీ అయినపుడు సెకండరీ పోష్టులుగా మార్చడమంటే

ఇకముందు సర్వీసులోవున్నవారెవ్వరూ అదనపు విద్యార్హతలు సంపాదించుటకు కృషి చేయరాదని నియమం పెట్టటంగానే భావించాల్సి వస్తున్నది.

ఏమైనా ప్రభుత్వం శాస్త్రీయ దృక్పథంతో సమస్యను ఆలోచించటం లేదనటానికి ఉపాధ్యాయుల సంక్షేమంపట్ల, ముఖ్యమంత్రి ఉపాధ్యాయులకుచేసిన వాగ్దానంపట్ల ఏమాత్రం గౌరవం, నిజాయితీ లేనట్లుగా మరోసారి ధృవపడుతున్నది. ఇప్పటికైనా ప్రభుత్వం దీర్ఘంగా ఆలోచించి అర్హతనుబట్టి వేతన మన్న సూత్రాన్ని అమలుపరచి విద్యారంగ సంక్షేమానికి తోడ్పడ వలసిందిగా యు. టి. యఫ్. అధ్యక్ష ప్రధాన కార్య దర్శులు శ్రీ కె. నారాయణరావు, శ్రీ ఎ. వెంకటుస్వామి ఒక ప్రకటనలో కోరేరు.

# ప్రత్యక్షపోరాటాలు-ఫలితాలు

## గన్నవరం సమితి టీచర్ల 13 రోజుల నిరాహారదీక్ష

కృష్ణాజిల్లా గన్నవరం సమితిలో పేరుకుపోయిన అపరి ష్కృత సమస్యల పరిష్కారం అక్రమ బదిలీలు సరిచేయుట గురించి, అంతకుముందునుంచీ పాటించబడుతున్న స్ట్రిక్టు సీని యారిటి మేనేజిమెంటు కావాలని ఉల్లంఘించిన విషయమై తుపాను బాధితులకు సమితి ఉపాధ్యాయులు యిచ్చిన ఒకరోజు జీతం సమితి ఆఫీసులో కొందరు కైంకర్యంచేసిన దారుణ ఉదం తాన్ని వెలుగులోనికి తీయాలని, యిలాంటి 19 సమస్యలపై సమితియందలి ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్, ఉపాధ్యాయ ఫెడరేషన్, రిజిష్టర్డు ఫెడరేషన్ యీ మూడు సంఘాలు ఐక్య కార్యాచరణ కమిటీగా ఏర్పడి మేనేజిమెంటుకు నోటీసు యిచ్చాయి.

సమస్యల పరిష్కారానికి ఆర్.డి ఓ. సమక్షంలో జరిగిన చర్చలుకూడా విఫలమైనవి. గత్యంతరంలేని పరిస్థితిలో సమితి ఆఫీసుముందు 14-9-77 నుండి రిలే నిరాహార దీక్షలు జరుపబడి నవి. 14 వ తేదీ శిబిరాన్ని శ్రీ కె. నారాయణరావుగారు ప్రారంభించారు. శ్రీయుతులు యన్ సీతారామాచారి,ఎ.వెంకటు స్వామి, యం. వెంకటురత్నం, యన్. నాగలింగం, వి. విజయ రామరాజు, మొ॥ వారు సందేశాలు యిచ్చారు.

జిల్లా విద్యాశాఖాధికారి, సమితి పెద్దలతోను, ఉపాధ్యా యులతోను, సమస్యల పరిష్కారమునకు చర్చలు జరిపారు. మూడు రాష్ట్రసంఘాల పక్షాన, విద్యాశాఖమంత్రి, పంచాయితీ రాజ్ శాఖామంత్రి, జిల్లాకలెక్టరులనుకలిసి సమస్యలను పరిష్క రించాలని, వెంటనే జోక్యం కల్గించుకోవాలనికోరడం జరిగింది. ఎందరు ఎన్నిసూచనలు చేసినా మేనేజిమెంటు మొండిగా నిరాకరిస్తూ వచ్చింది.

ఉపాధ్యాయులు ఇనుమడించిన దీక్షతో నిరాహారదీక్షలు సాగించారు. వందలాదిమంది ఉపాధ్యాయులు, ప్రజా సంఘాల నాయకులు శిబిరాన్ని దర్శించి మద్దతు తెల్పారు. ఉపాధ్యాయ సంఘాల పక్షాన శ్రీయుతులు సింగరాజు రామకృష్ణయ్య, జి. నాగేశ్వరరావు, జీవన్ తదితరులు శిబిరాన్ని దర్శించి సందేశాలు యిచ్చారు.

శ్రీయుతులు పి. శ్రీరాములు, ఎం.వి. రత్నం, ప్రేమానందం గార్లు శిబిర నిర్వహణ బాధ్యతలు నిర్వహించారు.

యీ స్థితిలో ప్రజాసంఘాలు రంగం లోనికి దిగి 25-9-1977న ఉపాధ్యాయులతో కలిసి బ్రహ్మాండమైన వూరే గింపు, బహిరంగసభ జరిపేరు. బహిరంగసభలో ఉపన్యాసకులు మేనేజిమెంటు చర్యలను, అవినీతి, అక్రమాలను విమర్శించారు.

యీపోరాటంలో సమితి ఉపాధ్యాయులు, ప్రక్క సమితి ఉపాధ్యాయులు, స్కూలు కండెక్టర్స్ 132మంది వరసగా నిరా హార దీక్షలో పాల్గొన్నారు. ఈ ప్రజాపోరాటంవల్ల మేనేజి మెంటు దిగి రాక తప్పలేదు.

1976 నుండి మూలబడి వున్న టి.టి.ఏ.లు రెక్కలువచ్చి యం.వో.ల రూపేణా ఉపాధ్యాయులకు అందినవి. ఇంక్రిమెంట్లు వందలాది వెలుగు చూసినవి తుపాను బాధితులనిధి ప్రభు త్వానికి జమ చేయబడింది. కొన్ని అక్రమ బదిలీలు సరిచేయ బడినవి. యితర సమస్యలపై కదలిక వచ్చింది.

ఈ పరిస్థితులలో 26-9-77 తేదీన సమితి స్పెషల్ ఆఫీసరు ఆర్.డి.ఓ, బి.డి.ఒ, సమితి సర్పంచ్‌ల కమిటీ ఉపా ధ్యాయుల ఐక్యకార్యాచరణ సమితితో చర్చలు జరిపి బదిలీలు వెంటనే సరిచేస్తామని, సీనియారిటీ విషయమై ఇకఎట్టిమార్పులు చేయమని, జరిగిన మార్పులు ప్రభుత్వంనుండి వివరం రాగానే సరిచేస్తామని మిగిలిన అన్ని సమస్యలు వెంటనే పరిష్కరించెద మని హామీఇచ్చారు. 13 రోజులుగా అపూర్వంగా సమైక్యంగా సాగిన నిరాహారదీక్షలు విరమించబడినవి. ఆర్. డి. ఓ గారు నిరాహార దీక్షితులకు నిమ్మరసముయిచ్చి దీక్షలు విరమింప జేశారు.

యిదే సందర్భంలో సమితిలో కొందరు వెలిగాకులు, మేనేజిమెంటుకొమ్ముగాచి, ఉపాధ్యాయులను చీల్చాలని చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. వారు ఉపాధ్యాయులచే తీవ్రంగా నిరసించబడి, నెట్టివేయబడ్డారు. ఉపాధ్యాయుల చైతన్యంముందు వారు పలాయనం చిత్తగించారు.

## విజయవాడ టీచర్ల 5 రోజుల నిరశనదీక్ష

ఆరునెలలుగా బకాయిపడివున్న తమ జీతాలు వెంటనే చెల్లించాలనీ, మేనేజిమెంటు అక్రమ చర్యలు ఆపుచేయాలని కోరుతూ సెప్టెంబరు26వ తేదీనుండి విజయవాడ సబ్-కలెక్టర్ ఆఫీసుముందు నిరాహారదీక్ష జరుపుతున్న విజయవాడ చిట్టినగర్ ఎయిడెడ్ పాఠశాల ఉపాధ్యాయులు సెప్టెంబరు 30 వ తేదీన తమ దీక్ష విరమించారు.

జిల్లావిద్యాశాఖాధికారి నిరాహారదీక్షా శిబిరానికి వచ్చి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించుటకు తప్పక కృషిచేయ గలనని హామీయిచ్చారు. ఉపాధ్యాయులకు జీతాలు, ఎరి యర్సు, సిడిలతో సహా చెల్లించేందుకు, శ్రీమతి అలీసమ్మకు పోస్టింగు యిచ్చేందుకు, జీతాలు ఉపాధ్యాయులకే నేరుగా చెల్లించేందుకు అవసరమైన చర్యలు గైకొనేందుకు ఆయన అంగీకరించారు. నిరాహార దీక్షలో పాల్గొంటున్న వారందరికీ ఆయన నిమ్మరసం యిచ్చారు.

ఈ నిరాహార దీక్షలకు యు. టి. యఫ్. ఆధ్వర్యం వహించింది.

# మొవ్వసమితిలో ధర్నా కార్యక్రమం విజయం

కృష్ణాజిల్లా, మొవ్వసమితిలో దీర్ఘకాలంగా అపరిష్కృతంగాఉన్న సమస్యలపై ఆగస్టు 2న సమితి ఆఫీసు ముందుజరిగిన ధర్నాకార్యక్రమం దిగ్విజయమయింది ఎవరెన్నిదుష్ప్రచారాలు చేసినా సరకుగొనక పీడితోపాధ్యాయులు 70 మందికిపైగా ధర్నాలో పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ సమితులనుండి సౌహార్ద ప్రతినిధులు, రాష్ట్రజిల్లాల నాయకులు కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేశారు.

ధర్నా ప్రారంభించిన సాయంత్రం బి డి ఓ. స్పెషల్ ఆఫీసర్ గార్లు శిబిరానికివచ్చి సమస్యల పరిష్కారానికి తాము గైకొన్న చర్యలు వివరించారు. టేకెరోవర్ పాఠశాలల ఉపాధ్యాయుల రీఫిక్సేషన్ పూర్తిఅయిందనీ, ఆర్డర్లు అయా ఉపాధ్యాయులకు త్వరలో పంపగలమనీ, బదిలీ టి.టి.ఎ.ల బిల్లులేవీ పెండింగ్‌లో లేవనీ, సక్రమంగా లేనిబిల్లులు త్రిప్పివంపేమనీ, సరిజేసివంపితే వాటినికూడా పాస్‌చేస్తామనీ కేర్‌మిడ్డేమీల్సు నిర్వహణకు చెల్లించవలసిన కంట్రిబ్యూషన్ పరిషత్, గవర్నమెంట్‌వారి కోటాల చెల్లింపుకు వ్రాశామని, అవిరాగానే చెల్లింపగలమనీ, కండక్టన్ల అరియర్లు చెల్లించే ఆర్డర్లు జారీ చేశామనీ, సస్పెన్షన్ల కేసులన్నీ పరిష్కరించామనీ, ఇకముందు విచారణ లేకుండా ఉపాధ్యాయులపై చర్యలు తీసుకొనమనీ, ఉపాధ్యాయుల సెలవుల్ని వెంటవెంటనే మంజూరు చేస్తామనీ, సమన్వయ సమావేశాలు రెగ్యులర్‌గా జరుపుతామనీ ప్రకటించారు.

ఆ విధంగా ఉపాధ్యాయుల కోర్కెలయెడ సానుభూతి చూపి పరిష్కార కృషికి తోడ్పడిన సమితి బి డి ఓ, స్పెషల్ ఆఫీసర్ గార్లకు సమితిశాఖ తరఫున కృతజ్ఞతలు తెలియజేయబడ్డాయి. ధర్నా కార్యక్రమానికి విరాళాలిచ్చిన దాతలకు, సహకరించిన మిత్రులకు, ప్రత్యేకంగా ధర్నాలో పాల్గొనిన వారికి భోజనాది సౌకర్యాలు కూర్చిన శ్రీ వి. వెంకటరత్నం, శ్రీమతి జయశ్రీలగార్లకు, ధర్నాలో పాల్గొనిన సౌహార్ద ప్రతినిధులను, రాష్ట్ర, జిల్లా నాయకులకు సమితిసంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ పి సోమయ్య అభివందనాలు తెలియజేస్తున్నారు.

**పెందుర్తి సమితిశాఖ :** విశాఖజిల్లా, పెందుర్తి సమితిశాఖ సమావేశం 8-8-77న శ్రీ వై. ఆనందరావు అధ్యక్షతన జరిగింది, జిల్లాసంఘ అధ్యక్ష ప్రధానకార్యదర్శులు శ్రీ పి. సాంబమూర్తి, ఎ. బాబూరావు, కార్యదర్శి శ్రీ హెచ్. అచ్యుతరామయ్యగార్లు ఆ సమావేశానికి హాజరయ్యారు. పిదప అధ్యక్షులుగా శ్రీ వై. ఆనందరావు. ఉపాధ్యక్షులుగా శ్రీ బి వి. పార్వతీశం, ప్రధాన కార్యదర్శిగా శ్రీ జి. యమ్. రామకృష్ణారావు, శక్రటరీగా శ్రీ యన్. కృష్ణారావుగార్లు ఎన్నికయ్యారు.

పెందుర్తి సెంటర్‌శాఖకు అధ్యక్షులుగా శ్రీ వి. విలాస కుమార్, శక్రటరీగా శ్రీ కె. పైడిరాజు, మరి 7మంది కౌన్సిలర్లు ఎన్నికయ్యారు. గోపాలపట్నం సెంటర్ శాఖకు అధ్యక్షులుగా శ్రీ ఎ. సోమయాజులు, శక్రటరీగా శ్రీ సి. హెచ్. సూర్యనారాయణ కౌన్సిలర్లుగా మరి 12మంది ఎన్నికయ్యారు. గాజువాక సెంటర్ శాఖకు అధ్యక్షులుగా శ్రీ బి.వి. పార్వతీశం, శక్రటరీగా శ్రీ వి. సంజీవరావు, మరి 5మంది కౌన్సిలర్లుగా ఎన్నికయ్యారు. చంద్రంపాలెం సెంటర్ శాఖకు అధ్యక్షులుగా శ్రీ యమ్. జార్జి, శక్రటరీగా శ్రీ యం. వి. యస్. సత్యనారాయణమూర్తి, మరి 4మంది కౌన్సిలర్లు ఎన్నికయ్యారు.

## రిటైర్డ్ టీచర్లకు సన్మానం

విశాఖ జిల్లా, పెందుర్తి సమితిలో గోపాలపట్నం ప్రాథమిక పాఠశాలనుండి పదవీ విరమణ చేసిన శ్రీ సి. హెచ్. సత్యనారాయణగార్కి, శ్రీ వండా సన్యాసిగార్కి శ్రీ యన్. సంపతరావు అధ్యక్షతన 14-9-77 న సన్మానసభ అత్యంత వైభవంగా జరిగింది. ఆ సభకు సమితి యి.ఓ, యస్. డి. ఐ, జె.డి ఐ. గార్లు హాజరయ్యారు. శ్రీ వై. ఆనందరావు, శ్రీ ఎ. సోమయాజులు, శ్రీయుత అప్పారావు గార్లు సన్మానిత ఉపాధ్యాయుల సేవల్ని కొనియాడారు. పిదప శ్రీ ఆర్. సాంబమూర్తిపట్నాయక్ గారిచే వందన సమర్పణ చేయబడింది.

**తూ. గో. జిల్లాశాఖ :** జిల్లా కార్యవర్గ సమావేశం 4-9-77న రాజమండ్రిలో శ్రీ పి బి ముత్తారావు అధ్యక్షతన జరిగింది. జిల్లాలోని వివిధ పట్టణ సమితి యూనిట్లనుండి 50 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

రాష్ట్ర ప్రధానకార్యదర్శి శ్రీ ఎ. వెంకటస్వామి ఖమ్మం మహాసభల్ని సమీక్షించి భవిష్యత్ పోరాట కార్యక్రమం వివరించారు. జిల్లా శాఖ ప్రధానకార్యదర్శి సమర్పించిన నివేదికలపై చర్చల్లో దాదాపు 30 మంది పాల్గొని నిర్మాణాత్మక సూచనలు చేశారు.

చెన్నుపాటి స్మారక భవననిధికి విజ్ఞప్తి చేయగా రు. 2500 వాగ్దానాలు ప్రకటించారు. పిదప జిల్లా పరిషత్తులోను, సమితిల్లోను కోరిన ప్రాంతాలకు బదిలీలు జరప వలసిందిగా జిల్లా కలెక్టర్‌ని కోరుతూ తీర్మానించారు. సెప్టెంబరు 30 లోగా వివిధ సమితి పట్టణ శాఖలు విధిగా తమ ఆడిట్ రిపోర్టులు జిల్లా శాఖకు అందజేయాలని, ఈ నెలలో 500 పత్రిక చందాలు సేకరించాలని తీర్మానాలు చేశారు.

## జిల్లా కలెక్టర్‌తో సమన్వయ సమావేశం

29-7-77 న కాకినాడలో జిల్లా సబ్‌కమిటీ సమావేశం శ్రీ పి. బి. ముత్తారావు అధ్యక్షతన జరిగింది. సి. డి. రెండవ వాయిదా సొమ్ము ఉద్యోగులకు చెల్లించటానికి నిర్ణయించిన కేంద్ర ప్రభుత్వాన్ని ఆ సమావేశం అభినందించింది. ఆగస్టు 15 లోపల ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం గానిచో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ప్రత్యక్ష చర్య జరపాలని, దానికి జిల్లాలోని అన్ని శాఖలు సిద్ధంగా ఉండాలని తీర్మానింపబడింది.

ప్రత్యక్ష చర్య నోటీసు ఫలితంగా జిల్లా కలెక్టర్ అధ్యక్షతన 30-7-77 న జిల్లా పరిషత్తు మీటింగు హాలులో ఉపాధ్యాయ ప్రతినిధులతో సమన్వయసమావేశం జరిగింది. డి యి.ఓ. జడ్.పి. కార్యదర్శి, శ్రీ డి. శివరామరాజు (యమ్. యల్. సి.) గార్లు దానికి హాజరై చర్చల్లో పాల్గొన్నారు.

యు.టి.యఫ్. ఇచ్చిన నోటీసులోని అంశాలపై సుదీ

ర్థంగా చర్చలు జరిగేయి. బదిలీలలోని అవకతవకల్ని సరి జేయాలని, 1975 సం॥ తాలూకు సెలక్షన్‌గ్రేడ్ పోష్టులు వెంటనే రిలీజ్ చేయాలని, స్టయిపెండరీ టీచర్లకు 1-1-76 నుండి బి.యి.డి. స్కేలుఇవ్వాలని, పి.యఫ్.లోన్లు మంజూరులో జరుగుతున్న జాప్యాన్ని నివారించి అవినీతిని అరికట్టాలని, ప్రధాన కార్యదర్శి శ్రీ వి. సూర్యనారాయణరాజు కలెక్టర్ గార్నికోరేరు. ప్రతిసమన్వయ సమావేశానికి తాను హాజరవు తానని, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తగుచర్యలు తీసుకొంటానని కలెక్టర్‌గారు హామీయిచ్చారు. ఉపాధ్యాయ సంఘాల తరపున శ్రీ డి. శివరామరాజు కలెక్టర్‌గార్కి కృత జ్ఞతలు తెల్పారు.

**రాజమండ్రి పట్టణశాఖ :** 18-9-77న రాజమండ్రి పట్టణశాఖ కార్యవర్గ సమావేశం శ్రీ యన్.వి.యస్.వి. ప్రసాద రాజుగారి అధ్యక్షతన జరిగింది. ప్రధాన కార్యదర్శి శ్రీ సాల్మన్ రాజు కృషి నివేదిక, ఆర్థిక రిపోర్టు ప్రవేశ పెట్టారు. రిపోర్టులు చర్చానంతరం ఆమోదింపబడ్డాయి. పిదప డైరెక్టు పేమెంటు ఉన్న పాఠశాలల సిబ్బందికి ఇంక్రిమెంట్లు, ఎరెండ్ లీవు, మెట ర్నటీ లీవు మరియు ఇతర శలవులు డి.ఇ.ఓ. మంజూరు చేయా లని ఆ పాఠశాల కంటింజెంట్ ఖర్చుల్ని ప్రతినెలా మేనేజి మెంటు భాగంనుండి మినహాయించి హెడ్మాష్టర్ల కిప్పించాలనీ, పది సంవత్సరాలకు పూర్వం స్థాపించబడిన ప్రభుత్వ ఎయిడ్ పూర్తిగా పొందుతున్న పాఠశాలలకు పర్మినెంట్ రికగ్నిషన్ ఇప్పించాలనీ, ప్రతినెలా 1వ తారీఖుకే ఎయిడెడ్ పాఠశాలలకు జీతాలిప్పించాలనీ, ఎయిడ్ పోష్టులుగల పాఠశాలల్లో సెక్షన్లు రద్దయితే ఆ పోష్టును ఉపాధ్యాయునితోసహా డి.యి.ఓ. ఇతర పాఠశాలలకు బదిలీచేయాలనీవివిధతీర్మానాలు ఆమోదించారు.

**కపిలేశ్వరపురం సమితి :** కోటిపల్లిసెంటర్ క్లాసుకు యు.టి.యఫ్. కార్యకర్త శ్రీయమ్. జయరాముడు శక్రటరీగా ఎన్నుకోబడ్డారు. 29-7-77న సమితి ఆఫీసులో సమన్వయ సమావేశం జరిగింది. దానితో అక్రమబదిలీలరద్దు ప్రత్యేకాంధ్ర సందర్భంలో అదనంగా పనిచేసినదినాలకు ఎరెండ్‌లీవు క్రెడిట్ కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకొన్నవారికి అదనపు ఇంక్రిమెంట్లు సర్వీస్ రెగ్యులరైజేషన్ మొదలగు 20అంశాలపై చర్చ జరిగింది. దీనితో అధికారుల పక్షాన స్పెషల్ ఆఫీసర్, బి.డి.ఓ.యి ఓ. (విద్య) పాల్గొన్నారు. సంఘపక్షాన జిల్లాకార్య దర్శి శ్రీ వి సూర్యనారాయణరాజు, సర్వశ్రీ యల్. చిన్న బ్బాయి, యమ్ సూర్యనారాయణ, బి.యస్. కాశీవిశ్వేశ్వర రావు, యన్.వి ప్రసాద్, హెచ్. సత్యనారాయణ వి. వెంకట రావుగార్లు పాల్గొన్నారు. సమితిలో జి ఓ 572 ప్రకారంఅక్రమ బదిలీలు కొంతవరకు సరిజేసిన స్పెషల్ ఆఫీసర్, బి. డి. ఓ; యి. ఓ.గార్లకు సమితిశాఖ కృతజ్ఞతలు తెల్పింది. మిగిలివున్న అక్రమబదిలీలు సరిజేయాలని, సి డి.రెండవ వాయిదా వెంటనే చెల్లించాలని 6 అంశాలుగల మెమొరాండాన్ని 30-8-77న సమితిశాఖ స్పెషల్ ఆఫీసర్‌గార్కి ఇచ్చింది. వారు మీటింగు వేయించి వెంటనే పరిష్కరిస్తామన్నారు.

**సన్మానం :** జిల్లా ఉపాధ్యాయ అవార్డు గ్రహీత శ్రీ ద్విభాష్యం వెంకట్రావుగార్కి తూ. గో. జిల్లా శంఖవరం పాఠశాలలో డా. పి.వి చౌదరిగారి అధ్యక్షతన సెంటర్ టీచర్లు ఘనసన్మానం చేశారు.

**అమలాపురం పట్టణశాఖ :** పట్టణ యు టి.యఫ్. శాఖ తరపున4-8-77న మునిసిపల్ కమీషనర్‌తో రాయబారం జరిపేరు. ప్రతినెల 1వ తేదీన విధిగా జీతాలు చెల్లించాలని, వేసక్టమీ చేయించుకొన్నవారికి ప్రోత్సాహకర ఇంక్రిమెంట్లు ఇవ్వాలని ఓటర్ల లిష్టులువ్రాసిన ఎన్యూమరేటర్లకు, సూపర్ వైజర్లకు ఎరెండ్‌లీవు క్రెడిట్ చేయాలని, హెడ్మాష్టర్ల డ్యూటీ అలవెన్స్‌పై డి ఏ. చెల్లించాలని, పి.యఫ్. స్లిప్పులివ్వాలని అప్ప డిచ్చిన మెమొరాండంలో కోరేరు ప్రతినెల 1వ తేదీకే జీతా లిస్తామని, మిగిలిన కోర్కెలుకూడ త్వరలో పూర్తి చేస్తానని కమీషనర్ హామీయిచ్చారు. ప్రతినిధివర్గంలో తూ గో. జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీ వి. సూర్యనారాయణ రాజు, పట్టణ శాఖ అధ్యక్షురాలు శ్రీమతి ఎ. లెనోర, కార్యదర్శి శ్రీ జి. సోమేశ్వరరావు పాల్గొన్నారు.

## విద్యామంత్రితో యు.టి.యఫ్. రాయబారం

విద్యాశాఖమంత్రి శ్రీ మండలి వెంకటకృష్ణారావుగారు విజయవాడ వచ్చిన సందర్భంగా 29-9-77న ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ పక్షాన వారిని కలిసి, మెమోరాండములు యిచ్చి రాయబారములు జరుపుట జరిగింది.

చిట్టినగర్ ఉపాధ్యాయులు ఆరునెలలుగా రాని జీతాల గురించి, సి.డి. చెల్లింపు, మొదలగు సమస్యలపై 26వ తేదీనుండి సబ్ కలెక్టరు కార్యాలయం ముందు నిరాహారదీక్ష సాగించు చున్నారని, ఇప్పటికి నాల్గురోజులయినా ఏవిధమైన కదలిక అధికారులలో రాలేదని, వెంటనే జోక్యం కలిగించుకొని సమ స్యలు పరిష్కరింప చేయాలని కోరుట జరిగింది. మంత్రిగారు ప్రక్కనేవున్న జిల్లావిద్యాశాఖాధికారిగార్కి ఆ మెమోరాండం యిచ్చి, వెంటనే సమస్యలు పరిష్కరించమని చెప్పేరు.

ప్రతినిధివర్గము విద్యామంత్రిగారికిమరొక మెమొరాండం యిచ్చింది. అందు పటమటలోగల వయోజన విద్యాశిక్షణ కేంద్రములోగల అతినికృష్ట పరిస్థితులు వివరించారు. ఆ శిక్షణా కేంద్రములో రాష్ట్రము నలుమూలలనుండి వచ్చిన ఉపాధ్యా యులు ఆరువారములు శిక్షణపొందుతారని, ఒక్కొక్కసారి 30 నుండి 50 వరకు వుండేవారికి ఆ కేంద్రములో ఏ విధమైన సౌకర్యములులేవని, లైటింగు, మంచినీరు, మరుగుదొడ్లులేక, చెమ్మనేలపై, ఈగల దోమలతో అతినికృష్ట పరిస్థితులలో యిబ్బందులు పడుచున్నారని, పైగావారికి నెలకు రూ 22/-లు స్టయిపెండుయిచ్చుట దారుణమని, మంత్రిగారి దృష్టికి తెచ్చుట జరిగింది వెంటనే వారిపరిస్థితులు మెరుగుపరచి, నెలకు రూ 100/-లు స్టయిపెండు యివ్వాలని కోరుట జరిగింది. పరిస్థితులు మెరుగుపరచెదమని మంత్రిగారు హామీయిచ్చేరు.

రాయబారవర్గములో శ్రీయుతులు కె.నారాయణరావు, ఎ. వెంకటస్వామి, యన్. రామకోటేశ్వరరావు తదితరులు గలరు.

# ఏజన్సీ ఎయిడెడ్ పాఠశాలల సమస్యలు

తూ.గో. జిల్లా ఏజన్సీ ఎయిడెడ్ పాఠశాలల సమస్యల్ని ప్రభుత్వ దృష్టికి తెస్తూ వాటిని వెంటనే పరిష్కరించాలని జిల్లా శాఖ డిమేండ్ చేస్తున్నది.

1. 1917 సం॥నుండి ఏజన్సీలోగల పాఠశాలలకు 1:15, వెల్లడి గ్రామాలలో 1-25 హాజరుండాలని నియమం వుంది. కాని యీమధ్య ఆవివక్ష లేకుండా అన్నిటికి 1·30 హాజరు నిర్ణయించారు. వెనుకబడిన యీ గిరిజన ప్రాంతాల్లో పూర్వ నియమాన్నే అనుమతించ గోరుతున్నాము.

2. మద్రాస్ ఎడ్యుకేషనల్ రూలు 1920 ప్రకారం ఎయిడెడ్ పాఠశాలలకు మైలు దూరంలో ఆ పాఠశాల మేనేజర్ అభ్యంతరం పెట్టినచో మరియొక పాఠశాలకు గుర్తింపు ఇవ్వవచ్చును. అభ్యంతరం ఉంటే రికగ్నిషన్ ఇవ్వరాదు కాని ఆ నియమాన్ని ఉల్లంఘించి విద్యాశాఖ గుర్తింపు లేకుండా సమీకృత గిరిజన పాఠశాలలు ఇష్టం వచ్చిన రీతిలో వెలుస్తున్నవి. దానివలన ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో శాశ్వతంగా పనిచేస్తున్న సిబ్బందికి అపకారం జరుగుతున్నది. నిరుద్యోగం ఎదురౌతున్నది. కాన ఎయిడెడ్ పాఠశాలలున్న గ్రామాల్లో ప్రభుత్వమే హాస్టల్స్ పెట్టించి టీచర్లకు సర్వీసు భద్రత కలిగింప గోరుతున్నాము.

3. ఎయిడెడ్ టీచర్లకు కుటుంబసంక్షేమపథకం అమలు పరచగోరుతున్నాము.

4. ఏజన్సీలో ఎయిడెడ్ పాఠశాలలు 10, 15 సం॥ల నుండి పనిచేస్తున్నా ఏ సంవత్సరానికాసంవత్సరం మాత్రమే టెంపరరీ రికగ్నిషన్ ఇస్తున్నారు. అట్లుగాక వాటికి పర్మనెంటు రికగ్నిషన్ ఇప్పించాలని కోరుతున్నాము

5. 1957 లో ప్రాథమిక పాఠశాలల స్వాధీన చట్టం ప్రకారం ఏజన్సీ ప్రాంతఎయిడెడ్ పాఠశాలల్ని తప్ప మిగిలిన ప్రాంతాల్లోని ఎయిడెడ్ పాఠశాలల్నిస్వాధీనం చేసుకొన్నారు. ఏజన్సీ ఎయిడెడ్ పాఠశాలల్నికూడా ఆ విధంగా స్వాధీనం చేసుకోవాలని కోరుతున్నాము

6. 55 సం॥ నిండిన ఉపాధ్యాయులు ఒక్కొక్క సంవత్సరం చొప్పున పర్మిషన్ఇచ్చుటవలన 60 సం.లు పూర్తియగు దాక కొందరు సర్వీసులో ఉన్నారు. కాని వారికి 1978 లో రిటైర్ అయినవుడు పేఫిక్సేషన్ చేయకుండా పాతస్కేలుపై పెన్షన్ నిర్ణయించారు. కాన అటువంటి వారికి పేఫిక్సేషన్చేసి పెన్షన్ నిర్ణయింపగోరుతున్నాము.

7. 1976 సం॥ ప్రారంభంలో 1:15 ప్రకారం ప్రాథమిక పాఠశాలల్లో సరాసరి హాజరు సరిపోయింది. కాని 1976 డిశంబరు బిల్లు (ఫైనల్) ఇచ్చు సందర్భంలో 1;30 హాజరులేదని దాదాపు 4 బ్లాకుల్లో 20 పాఠశాలలకు గ్రాంటు తగ్గించి ఇచ్చియున్నారు. ఆ ఫైనల్బిల్లు ఇచ్చుకాలంలోనే 1:30 జి ఓ వచ్చింది. అది సంవత్సర ప్రారంభంలో అమలులోలేదు. కాన ప్రారంభంలో గల నియమం ప్రకారం తగ్గించబడిన గ్రాంట్లను వెంటనేఇప్పింప గోరుతున్నాము

8. హౌస్ రెంట్ అలవెన్స్ ఏజన్సీ ఎయిడెడ్ ఉపాధ్యాయులందరికి ఇప్పింప గోరుతున్నాము.

9. లోగడ ఏజన్సీ పాఠశాలలకు మెయిన్టెయిన్స్ గ్రాంటు 15 శాతం ఇచ్చేవారు కాని దాన్ని యిపుడు తగ్గించి యిస్తున్నారు.అలాగాక వెనుకటివలె పూర్తిగా గ్రాంటుఇప్పింప గోరుతున్నాము.

10. ఎయిడెడ్ ఉపాధ్యాయులకు 58 నవంబరు 1 నుండి ఏజన్సీ అలవెన్సు తీసివేశారు. 13-9-77 ను డిఘ్రాత్రం బి సి.ఎ ఇస్తున్నారు. సమితి ఉపాధ్యాయులకు మాత్రం 58 నుండి ఇస్తున్నారు. అలాగే ఏజన్సీ ఎయిడెడ్ వారికి కూడా 58 నుండి ఇప్పించగోరుచున్నాము.

**కె. చోడవరం సమితి (ఏజన్సీ) శాఖ :-** 6-8-77 న చోడవరం టి. ఎ. సెంటర్కు జిల్లాశాఖ అధ్యక్షులు శ్రీ పి బి. ముత్యాలరావు, సమితిశాఖ అధ్యక్షులు శ్రీ జి. ముత్యాలు శక్రటరీ శ్రీ వి. సత్యనారాయణ, రాష్ట్ర కౌన్సిలర్ శ్రీ టి. రంగారావుగార్లు హాజరై యు.టి యఫ్ ఆశయాల్నివివరించారు. ఆ సందర్భంలో వచ్చిన బి. డి. ఓ; ఇ. ఓ (విద్య) డి ఐ. డి మాజిస్ట్రేటర్ గార్లకు సమితి సమస్యలు విన్నవింపగా వాటిని త్వరలో పరిష్కరిస్తామని హామీ యిచ్చారు. స్థానిక యమ్. యల్. ఎ. ని కలిసి ఏజెన్సీ ఎయిడెడ్ ఉపాధ్యాయుల జీతాల బడ్జెట్ రిలీజ్ చేయటం గురించి ప్రభుత్వానికి ఱంతిఇప్పించటం జరిగింది.

**కోరుకొండ సమితి:** 27-7-77న సమితి ఆఫీసులో ఉపాధ్యాయ ప్రతినిధుల్తో సమితి అధికారుల సంయుక్త సమావేశం జరిగింది. దానిలో పి.యఫ్ నంబర్లు ఇచ్చుట, 50 శాతం డి.ఏ. తేల్చి పి.యఫ్.కు జమకట్టుట, 180 జి ఓ ప్రకారం ఇంక్రిమెంట్ తేదీలు మార్చుట మొదలగు 25సమస్యల్ని చర్చించటం జరిగింది. సంఘం తరపున శ్రీయుతులు పి. బి. ముత్యాలరావు, టి. వెంకట్రావు జె రంగారావు, జి ప్రసాదరావు, కృష్ణమూర్తిగార్లు ఆ చర్చల్లో పాల్గొనటం జరిగింది.

**పి. గన్నవరం సమితిశాఖ:** 24-7-77న పి.గన్నవరంలో శ్రీ కె. పళ్ళంరాజుగారి అధ్యక్షతన సమితిశాఖ విస్తృత కార్యవర్గ సమావేశం జరిగింది. కార్యదర్శి శ్రీ కె వి. సత్యనారాయణ కృషి రిపోర్టు సమర్పించారు. అక్రమ బదలీలు పరిశీలించాలని అధికారుల్ని కోరుతూ సమావేశం తీర్మానించింది.

---

**నిర్బంధ రిటైర్మెంట్కు గురయి తిరిగి ఉద్యోగంపొందిన ఉపాధ్యాయిని అనంతపురం జిల్లా యు.టి.యఫ్.కు కృతజ్ఞత**

ధర్మవరం మునిసిపాలిటీలోపనిచేస్తూ అక్రమంగా ఉద్యోగంనుండి తొలగింపబడిన శ్రీమతి డి. విజయలక్ష్మి జిల్లాశాఖ తీవ్రకృషివలన 11-7-77న తిరిగి నియామకం పొందినందుకు తనకృతజ్ఞత తెల్పుకొంటూ తనసమస్య పరిష్కారానికి తోడ్పడిన జిల్లా యు.టి.యఫ్. తనవంటి అభాగ్యురాండ్రకు తోడునీడగా నిల్చిందని, దానిలో సభ్యురాలిగా నుండుట తనకు గర్వకారణమని తన ఆనందాతిరేకాన్ని వెల్లడిస్తున్నది.

**పాలకొల్లు పట్టణశాఖ :** 3-9-77 న పాలకొల్లు మునిసిపల్ కమీషనర్‌గారి యొద్దకు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ యన్. ఆర్. పోలిసెట్టి, పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీ జి. యన్. ప్రసాదరావు గారు రాయబారం వెళ్ళి కో ఆర్డినేషన్ కమిటీని ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం క్రమబద్ధంగా పునర్నిర్మించాలనీ, సి.డి. మొదటి వాయిదాలో మినహాయించిన మొత్తాన్ని వెంటనే ఇవ్వాలనీ, పండుగ అడ్వాన్సు మంజూరు చేయాలనీ, పి యఫ్. ఎకౌంటు స్లిప్పులివ్వాలనీ, 1044 జి. ఓ. ప్రకారం స్పెషల్ టీచర్లకు అరియర్స్ వెంటనే ఇవ్వాలనీ, వివిధ సమస్యలపై మెమోరాండం సమర్పించారు. స్పెషల్ ఆఫీసర్ సమస్యలన్నిటినీ సావధానంగా విని న్యాయం కలుగ జేస్తామని హామీ యివ్వడం జరిగింది.

**ఆకివీడుసమితి :** 10- 9- 77న శ్రీ జి. అర్జునుడు గారి అధ్యక్షతన కార్యవర్గ విస్తృత సమావేశం జరిగింది. ప్రధాన కార్యదర్శి శ్రీ కె. సూర్యనారాయణరాజు నివేదిక సమర్పించిన పిదప జిల్లాశాఖ అధ్యక్షులు శ్రీ జి. రాఘవరాజు గారు ఖమ్మం విద్యా మహాసభల్ని సమీక్షించారు. అనంతరం బదిలీలు ఎయిడెడ్ టీచర్ల సమస్యల్ని చర్చించారు. విద్యా మహాసభలకు హాజరైనవారి జీతాలు నిరాకరించిన విషయం సంఘబాధ్యులు శ్రీ బి డి ఓ గారిని కలిసి చర్చించగా వెంటనే చెల్లించటానికి అంగీకరించారు ప్రధాన కార్యదర్శి వయోజనవిద్య శిక్షణకు వెళ్ళినందున సంఘ బాధ్యతలు సహాయ కార్యదర్శి శ్రీ యన్. ఆశీర్వాదంగారికి సబ్ కమిటీ నిర్ణయంమేరకు అప్పగించబడినది.

**పెనుమంట్ర సమితి :** 25-9-77న సమితి నూతన కౌన్సిల్ సమావేశం పెనుమంట్రలో శ్రీ వి. నారాయణస్వామి గారి అధ్యక్షతన జరిగింది. ప్రధాన కార్యదర్శి శ్రీ పి. వెంకట్రావు కృషి నివేదిక సమర్పించారు. పిదప జిల్లాకార్యదర్శి శ్రీ వి. శ్రీరామమూర్తిగారి పర్యవేక్షణలో అధ్యక్షులుగా శ్రీ వి. నారాయణస్వామి, ఉపాధ్యక్షులుగా శ్రీ జి. వి. సుబ్రహ్మణ్యం, శ్రీ ఎస్. ఎస్. ప్రకాశరావు ప్రధాన కార్యదర్శిగా శ్రీ పి. వెంకట్రావు కార్యదర్శులుగా శ్రీ వి.మార్కండేయులు, శ్రీ జి. సత్యనారాయణరెడ్డి మరి 12 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. పిదప ఉపాధ్యాయుల్ని రిక్వెస్ట్‌పై స్వస్థలాలకు బదిలీ చేయాలని, సీనియారిటీలిస్టు అమలు జరపాలనీ, ఇంక్రిమెంట్లు ఇతర ఎరియర్సు వెంటనే చెల్లించాలనీ వివిధ తీర్మానాలు చేశారు.

**కృష్ణాజిల్లా శాఖ :** 18-9-77 న జిల్లా శాఖ సబ్ కమిటీ సమావేశం శ్రీ యన్. రామకోటేశ్వరరావు అధ్యక్షతన గన్నవరంలో జరిగింది. గన్నవరం సమితిలోను, విజయవాడ చిట్టినగర్ యన్. యస్. కె. జె. మెహతా యు పి. స్కూలు టీచర్ల సమస్యల విషయంలోను సాగించబోయే రిలే నిరాహార దీక్షల్ని సర్వవిధాలా బలపరచాలని, వారి సమస్యల్ని అధికారులు తక్షణం పరిష్కరించాలని ఆ సమావేశం తీర్మానించింది. దానికి రాష్ట్ర సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులు శ్రీ కె. నారాయణరావు, శ్రీ యన్. సీతారామాచారి హాజరై పోరాట కార్యక్రమాల్ని జయప్రదం చేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు.

# మొవ్వసమితిలో అక్రమ బదిలీలు

కృష్ణాజిల్లా మొవ్వ సమితిలో అధికారుల నిరంకుశత్వం మితిమీరుతున్నది. రిక్వెస్టు ఇవ్వకపోయినా ప్రతి ఆర్డరుమీదా రిక్వెస్ట్ అని వ్రాసి భార్యాభర్తల్ని విడదీసి నిబంధనలకు వ్యతిరేకంగా విచ్చలవిడి బదిలీలు చేశారు. ఇదేమిటి? అని అడిగితే హరిజనుల్ని హరిజన పాఠశాలల్లోవేశాము మీ కులాలవారికి మీరే బోధించకపోతే ఇంకెవరు బోధిస్తార'ని కుల ప్రాతిపదిక పైన జవాబులు చెప్తున్నారు. ఇప్పటికి రెండులిస్టుల బదిలీలు వచ్చాయి. వాటిల్లో చేసినవారినే మరల మరల బదిలీలుచేయడం జరిగింది. ఇది ముడుపులిచ్చుకొనే వేటతప్ప మరొకటికాదని టీచర్లు కల్లోలానికి లోనవటం మామూలయింది.

మళ్ళీ మూడో బదిలీలలిస్టు ప్రారంభమయింది ఊరూరూ తిరిగి అండదండలేని అనాధల్ని, హరిజనుల్ని, భర్తృహీనుల్ని కలిసి 'మీరు మీ గ్రామాలనుండి వెళ్ళిపోండి మీకు భర్తలు గాని, అండగానిలేదుగాన మీరెక్కడైనా బ్రతకవచ్చును. అంటూ రిక్వెస్టు లివ్వమని బలవంత పెడుతున్నారు. వ్రాసి యివ్వకపోతే మీ సంగతి ఏం చేయాలో మాకు తెలుసు!' అంటూ బెదిరిస్తున్నారు.

ఈ విధంగా జి. ఓ. లను లెక్కచేయక, నిబంధనలను పాటించక విచ్చలవిడి బదిలీలు చేయటం అన్యాయమని, లంచగొండితనం మితిమీరి పోయిందని కాన యీ అక్రమాన్ని వెంటనే అరికట్టాలని జిల్లా యు.టి.యఫ్. శాఖ కోరుతున్నది. అధికారులు వెంటనే జోక్యం కలుగజేసుకొని న్యాయం కలిగించవలసిందిగా సమితిశాఖప్రధానకార్యదర్శి శ్రీ వి సోమయ్య విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఉయ్యూరు సమితిలో నూతన శాఖ

కృష్ణాజిల్లా ఉయ్యూరు సమితిలో 123 మంది సభ్యులతో నూతనశాఖ ఏర్పడింది. 2-10-77 న శ్రీ డి. మాధవరాజు అధ్యక్షతన ఉయ్యూరులో జరిగిన నూతన కౌన్సిల్ సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. శ్రీ కె. పాపారావు సమితిలో సాగించిన కృషిరిపోర్టుఇచ్చారు. పలువురు కార్యకర్తలుచర్చల్లో పాల్గొని ఉద్యమాభివృద్ధికి తగు సూచనలిచ్చారు. రాష్ట్ర సంఘాధ్యక్షులు శ్రీ కె. నారాయణరావు, జిల్లాశాఖ అధ్యక్షులు శ్రీ యన్. రామకోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు శ్రీ వి. సోమయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీ యం. ఏసురత్నం ఆ సమావేశంలో పాల్గొని సందేశాలనిచ్చారు పిదప నూతన సంవత్సరానికి అధ్యక్షులుగా శ్రీ జి. వెంకట్రామయ్య, ఉపాధ్యక్షులుగా సర్వశ్రీ డి.మాధవరాజు, హుస్సేన్ షరీఫ్, కె.రంగరామానుజం యం. యేసుదాసుగార్లు, ప్రధాన కార్యదర్శిగా శ్రీ కె. పాపారావు, కార్యదర్శులుగా సర్వశ్రీ వి బి.వి రాజు, యం. సోమయ్య వి. డేవిడ్‌రాజుగార్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పిదప సబ్ కమిటీ సమావేశమై సభ్యత్వ, పత్రికా క్యాంపెయన్లు ఉధృతంగా సాగించుటకు సమస్యలు సేకరించి అధికారుల్తో రాయబారాలు జరుపుటకు నిర్ణయించుకొన్నారు.

## బదిలీ బాధవల్ల శ్రీఎ. రామకోటేశ్వరరావు గారి అకాల మరణం

శ్రీ ఎ. రామకోటేశ్వరరావుగారు గతంనుండి అభ్యుదయ ఉపాధ్యాయ ఉద్యమంలో పనిచేస్తున్న సీనియర్ కార్యకర్త ప్రస్తుతం ఆయన కృష్ణాజిల్లా, ముస్తాబాద్ జడ్.పి. హైస్కూల్లో పనిచేస్తున్నారు. ఆయన ఖమ్మం మహాసభలకు హాజరై 20వ తేదీన పాఠశాలకు తిరిగి వెళ్ళుచుండగా మార్గమధ్యంలో గుండె ఆగి మరణించారు. ఆ సంగతి తెలియగానే యు.టి.యఫ్. పక్షాన అధ్యక్షులు శ్రీ కె. నారాయణరావు జిల్లాశాఖ ప్రధాన కార్యదర్శి శ్రీ యం. ఏసురత్నం, గన్నవరం సమితిశాఖ ప్రధాన కార్యదర్శి శ్రీ పి. శ్రీరాములు ఆయన అంతిమ యాత్రలో పాల్గొని జోహార్లర్పించి, మృతదేహంపై పుష్పగుచ్ఛాన్నుంచి శ్రద్ధాంజలి ఘటించారు.

జిల్లాలో పవర్ పాలిటిక్స్‌వలన జరిగిన బదిలీల కక్షసాధింపు చర్యలవల్లే ఆయనకు ఈ అకాల మరణం సంభవించిందని అందరూ అనుకుంటున్నారు. ఆయన అకాల మరణానికి రాష్ట్రసంఘం తనగాఢ సంతాపాన్ని తెలియ జేస్తున్నది.

## బాపట్ల తాలూకాలో శ్రీయం.జె.యం. పర్యటన
### ఐక్య పోరాటంతో తప్ప సమస్యలు పరిష్కారంగావని ఉద్బోధ

గుంటూరు జిల్లా, బాపట్ల తాలూకాలో శ్రీ యం. జె. మాణిక్యారావు (యమ్.యల్.సి) సెప్టెంబరు 28, 29, 30 తేదీలలో వివిధ పాఠశాలల్ని దర్శించి ఉపాధ్యాయుల కష్టనిష్ఠూరాల్ని తెలుసుకోవటమే గాక శాసనసభలోపలా, బయటా సాగించే సంఘటిత ఉద్యమాల పైనే విజయాలు ఆధారపడి ఉంటాయని ఉద్ఘాటించటం జరిగింది. ఉపాధ్యాయులందరూ చైతన్యంతో సంఘటిత పడాలని, ఐక్యపోరాటాలతోతప్ప సమస్యలు పరిష్కరింపబడవని వివిధ సభల్లో ఉద్బోధించటం జరిగింది. ఆ పర్యటనలో వివిధ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. యు.టి.యఫ్ తరఫున శ్రీ మైనేని అనుసరించటం జరిగింది. ఆ సందర్భంలో 28వ తేదీ సాయంత్రం నిదుబ్రోలు జడ్.పి. హైస్కూల్లో 29 తేదీన బాపట్ల ఎ.టి యమ్. హైస్కూలులోను బహిరంగ సభలు జరిగాయి. వందలాది టీచర్లు ఆ సభల్లో పాల్గొన్నారు.

**గుంటూరు జిల్లాశాఖ:** 25-9-77న తెనాలి మునిసిపల్ హైస్కూలులో జిల్లాశాఖ కార్యవర్గ సమావేశం. ఈమని, అమృతలూరు, తెనాలి సమితుల కార్యవర్గసమావేశాలు జరిగాయి. వివిధ క్యాంపెయిన్ను విజయవంతం చేయటానికి కార్యకర్తలు పనివిభజన చేసుకొన్నారు. జిల్లా కార్యవర్గ సమావేశానికి శ్రీ యం. రాయన్న అధ్యక్షత వహించారు. రాష్ట్రసంఘం తరఫున శ్రీ మైనేని హాజరై ఉద్యమరిపోర్టు యిచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ టి. అంజిరెడ్డి ప్రవేశపెట్టిన కృషి నివేదిక ఆర్థిక రిపోర్టులపై పలువురు చర్చల్లో పాల్గొని ఉద్యమాభివృద్ధికి వివిధ సూచనలు చేశారు. జిల్లాపరిషత్తు, డి.యి.ఒ. ఆఫీసుల్లోవున్న పెండింగ్ సమస్యలపై చర్చించి సత్వర పరిష్కారానికి పూనుకోవటానికి నిర్ణయాలు తీసుకొన్నారు. ఎయిడెడ్ మేనేజిమెంట్లు, ముఖ్యంగా ఆర్.సి.యం మేనేజిమెంటుజిల్లాలో టీచర్లపైచేసే దాడుల్ని గర్హించటమేగాక సంవత్సరాల తరబడి సమస్యలు పరిష్కరింపబడక టీచర్లను నానాబాధలకు గురిచేస్తున్న నిరంకుశచర్యల్ని ఖండించటం జరిగింది.

**పొన్నూరు పట్టణశాఖ:** 1-10-77 న పొన్నూరు పట్టణ సెంటర్ క్లాస్ సమావేశం శ్రీ ఎ. స్వామిదాసుగారి అధ్యక్షతన జరిగింది. దానికి శ్రీ మైనేని హాజరై యు.టి.యఫ్ ఆశయాన్ని, సమస్యా పరిష్కారానికి చేస్తున్న కృషిని, నూతన విద్యా విధానాన్ని వివరించటం జరిగింది. పట్టణశాఖ కార్యదర్శి శ్రీ ఎ. వెంకటేశ్వర్లు ఉపాధ్యాయ సమస్యల్ని వివరించి సంఘటిత శక్తితో పరిష్కరించుకోవాల్సిన ఆవశ్యకత తెల్పారు.

## యు.టి.యఫ్ కంచుకోటలోనే ఎయిడెడ్ టీచర్లకు రక్షణ

ఖమ్మం మహాసభలకు వివిధ జిల్లాలనుండి వచ్చిన ఎయిడెడ్ టీచర్లు, ఒకరికొకరు పరిచయం చేసుకోటానికి, వివిధ సమస్యలు సమన్వయ పరచుకోటానికి శ్రీ వి. ఉమామహేశ్వరరావు (హెడ్మాష్టర్, నరసాయపాలెం)గారి అధ్యక్షతన సమావేశమయ్యారు. రాజమండ్రి పట్టణశాఖ ప్రధాన కార్యదర్శి శ్రీ కె.యఫ్.సాల్మన్‌రాజు ఆ సమావేశం ఏర్పాటు చేయటానికి కృషిచేశారు ఈ క్రింది సమస్యల్ని యు టి.యఫ్. ద్వారా కృషి చేయటానికి తీర్మానించారు.

మేనేజిమెంట్ మారినప్పుడు మొదటి సర్వీసును పరిగణించాలి. డైరెక్ట్ పేమెంటుగల పాఠశాలల టీచర్లకు పి. యల్. ఇంక్రిమెంట్లు డిపార్ట్‌మెంట్ మంజూరుచేయాలి. ప్రభుత్వ ఉత్తర్వులను ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయులకు వెంటనే వర్తింపజేయాలి. హెచ్ ఆర్.ఎ వెనుకటినుండి అమలుపరచాలి. ఎయిడెడ్ పాఠశాలల్లో సీనియారిటీ అమలుపరచాలి. మిషన్ ఎయిడెడ్ పాఠశాలల్లో బదిలీలను క్రమబద్ధంచేయాలి. ఫేమలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయించుకొన్న ఎయిడెడ్ టీచర్లకు అదనపు ఇంక్రిమెంట్లు ఇవ్వాలి.

శ్రీ సాల్మన్‌రాజు మాట్లాడుతూ యు.టి.యఫ్. కంచుకోటలోనే మనకు రక్షణకలదని, కాన దాన్ని బలపరచాలని అన్నారు. అధ్యక్షులు మాట్లాడుతూ యు.టి.యఫ్. కు మన సమస్యల సమర్పించి పరిష్కారానికి కృషిచేసేట్టు పాటు పడాలని, నిర్భయంగా కార్యకర్తలు ముందుకు రావాలని, సంఘాన్ని పటిష్టం చేయటం ద్వారానే మన కోర్కెలు నెరవేరతాయని ఉద్బోధించారు. పిదప సర్వశ్రీ కె.యల్.యన్. రెడ్డి, యి. పున్నారావు, ఎ. హనుమంతరావు, డి వి. హెచ్. కె యస్.శాస్త్రి, పి. జె. సుందరరావు, సి. హెచ్. కృష్ణమూర్తిగార్లు వివిధ సమస్యలపై మాట్లాడారు.

## 1971 లో రిటైరైనా 58 రీఫిక్సేషన్ తీసుకోకుండానే రాజుపాలెం సమితిలో మరి రెండు మరణాలు

గుంటూరుజిల్లా, రాజుపాలెం సమితి 88 తాళ్ళూరులో హయ్యర్‌గ్రేడ్ టీచర్ శ్రీ టి. నాగభూషణం 14-7-77న మరణించారు. వీరిమరణానికి సానుభూతిగా శ్రీ జి.కోటేశ్వరరావు (సమితిసంఘ ప్రధాన కార్యదర్శి) అధ్యక్షతన సంతాపసభ జరిగింది. వీరికి 58 రీఫిక్సేషన్ రావలసి ఎన్నిసార్లు సమితి అధికారులకు మొరపెట్టుకొన్నా లాభంలేకపోయింది. 30 సం॥ల ఉపాధ్యాయ జీవితంలో క్యాజువల్ లీవుతప్ప మరోలీవు ఏదీ వాడుకోక ఈయనసేవచేశారు. అటువంటివారు 58 ఎరియర్ రాక కేవలం రూ. 20ల పెన్షన్‌తో ఇతర ఆధారాలులేక బ్రతుకీడుస్తూ జీవితం చాలించాల్సి వచ్చింది. అలాగే గుడిపాడులో 24-11-72 న రిటైరైన శ్రీమతి సి. హెచ్. దీనమ్మ 58ఎరియర్‌రాక బ్రతుకు భారమై మరణించింది. ఇలారీఫిక్స్ కానివారు సమితిలో దాదాపు 30 మంది వున్నార. వీరికైనా సజీవంగా వుండగా ఆ ఎరియర్స్ వస్తాయా ?

**పొన్నూరు సమితి శాఖ :** గుంటూరు జిల్లా, పొన్నూరు సమితిశాఖ సమావేశం 2-10-77 న శ్రీ యమ్. సయ్యద్‌నూర్‌గారి అధ్యక్షతన జరిగింది. జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ టి. అంజిరెడ్డి సమావేశంలో పాల్గొని పటిష్ఠ సంఘ నిర్మాణానికి తగు సూచనలు చేశారు. శ్రీ టి. బాలకృష్ణమూర్తి (ప్రకాశంజిల్లా శాఖ అధ్యక్షులు) అమృతలూరు సమితి శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీ కె. నారాయణరావుగార్లు సందేశాలిచ్చారు. పట్టణ సంఘ ప్రధానకార్యదర్శి శ్రీ ఆళ్ళ వెంకటేశ్వర్లు ఉద్యమ వ్యాప్తికి, సమస్యా పరిష్కార కృషికి తన సంసిద్ధతను తెలియజేశారు. శ్రీ బి. రాధాకృష్ణమూర్తి వందన సమర్పణ చేశారు.

**అమృతలూరు సమితి శాఖ:** గుంటూరు జిల్లా అమృతలూరు సమితిశాఖ నూతనకౌన్సిల్ సమావేశం 18-9-77 స్థానిక యం.యస్.ఆర్. ప్రాథమిక పాఠశాలలో శ్రీ యం. బాలగంగాధరరావు అధ్యక్షతన జరిగింది. ప్రధాన కార్యదర్శి శ్రీ కె. నారాయరావు సమర్పించిన కృషినివేదిక ఆర్థిక రిపోర్టు చర్చానంతరం ఆమోదింపబడ్డాయి. రాష్ట్రసంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎ.వి. స్వామి, శ్రీ మైనేని జిల్లాసంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ టి. అంజిరెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీ వై. యల్. నారాయణగార్లు ఆ సమావేశానికి హాజరై జిల్లా, రాష్ట్రఉద్యమ రిపోర్టులుచ్చారు. పిదప శ్రీ మైనేని అధ్యక్షతన విద్యాగోష్ఠి జరిగింది. శ్రీ యం. పాండురంగాచార్యులు (యన్. డి. ఐ.) విద్యా సమస్యల్ని గురించి శ్రీ ఎ. వి. స్వామి విద్యా బిల్లును గురించి శ్రీ అంజిరెడ్డి ప్రత్యామ్నాయ విద్యా విధానం గురించి వివరించారు. పిదప అధ్యక్షులుగా యం. బాలగంగాధరరావు, ఉపాధ్యక్షులుగా సర్వశ్రీ కె. దేవసహాయం, సి. హెచ్. లాజరస్‌గార్లు ప్రధాన కార్యదర్శిగా శ్రీ కె నారాయణరావు, కార్యదర్శులుగా సర్వశ్రీ కె హరనాథబాబు, వై శ్రీధరరావు, కె. సుబ్బారావు గార్లు, వివిధ సెంటర్లనుండి మరి 9 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు మరొక ఉపాధ్యక్షుణ్ణి కోఆప్ట్ చేసుకోటానికి కార్యవర్గానికి అధికారమిచ్చారు. శ్రీ యస్. శేషగిరిరావు వందన సమర్పణతో సమావేశం దిగ్విజయంగా ముగిసింది. సమితిలో విరివిగా సభ్యత్వం చేర్పించుటకు, సంఘాన్ని మరింత పటిష్ఠవంతంగా నడుపుటకు కార్యకర్తలు నిర్ణయించు కొన్నారు. శ్రీ కె నారాయణరావు, కనకదుర్గాంబ దంపతులు చెన్నుపాటి భవన నిధికి రు 116/-లు ప్రకటించారు మరి నాలుగు జీవిత చందాలు ప్రకటించడం కూడా జరిగింది.

**నెల్లూరు జిల్లాశాఖ:** జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం శ్రీ యం. పోతురాజుగారి అధ్యక్షతన 26 9-77 న నెల్లూరులో జరిగింది. రాష్ట్ర ప్రధానకార్యదర్శి శ్రీ ఎ. వెంకటస్వామి, కార్యదర్శి శ్రీ తిరుపాలు ఆ సమావేశానికి హాజరై ఖమ్మం మహాసభల్ని సమీక్షించి సందేశాలిచ్చారు. పిదప జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ టి. కొండాచారి జిల్లా నివేదిక సమర్పించారు. చర్చల్లో పలువురు పాల్గొని ఉద్యమాభివృద్ధికి తగు సూచనలు చేశారు. పిదప సభ్యత్వ క్యాంపెయిన్,చెన్నుపాటి భవననిధి దిగ్విజయం చేయటానికి కార్యకర్తలు కృతదీక్షను ప్రకటించి పని విభజన చేసుకొన్నారు. పిదప ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి పెంపుదల ఉత్తర్వు రద్దుచేయ వలసిందిగాను, మ్యూచువల్ రిక్వెస్ట్ బదిలీలు, జడ్.పి.కి ఇచ్చిన గత మెమొరాండంలోని సమస్యలు వెంటనే పరిష్కరింప వలసిందిగాను తీర్మానాలు చేశారు. 15-10-77 లోగా జడ్. పి. సమస్యలు పరిష్కరింపని యెడల 20-10-77న జడ్ పి. ఆఫీసు ఎదుట నిరసన తెలియజేస్తూ ప్రదర్శన చేయాలనీ, రెండవ దశ కార్యక్రమంగా ధర్నా జరపాలని తీర్మానించారు.ఇటీవల నూతన మూల్యాంకన విధాన శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులకు టి ఏ. డి.ఏ ఇవ్వని ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ రాబోవు 5,6,7 తరగతుల ఉపాధ్యాయుల శిక్షణ సందర్భంలో 10 నిమిషాలు వాకౌట్ చేయటానికి నిర్ణయించారు.

**రాయబారాలు:** 12-9-77 న శ్రీ యం. మాధవరావు (యం. యల్. సి) శ్రీ తిరుపాలు, శ్రీ టి. కొండాచారి గార్లతో కూడిన ప్రతినిధివర్గం జడ్. పి. స్పెషల్ ఆఫీసర్, కార్యదర్శి పరిషత్ విద్యాశాఖాధికార్లను కలిసి వివిధ సమస్యలపై మెమొరాండాలు ఇచ్చారు. రిక్వెస్టు బదిలీలు పరిశీలించి సాధ్యమైనన్ని చేయగలమని, వింజమూరు సమితిలో సి. డి. మొదటి వాయిదా సొమ్ముచెల్లించటానికి వెంటనే చర్యలు తీసుకొంటామని, కావలిలో జిల్లాపరిషత్ ఖాళీ స్థలంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఇళ్ళు కట్టుకోటానికి పర్మిషన్ ఇవ్వగలమనీ, గతంలో యిచ్చిన సమస్యల్ని వెంటనే పరిష్కరిస్తామని, సి. డి రెండవ వాయిదా యల్. యఫ్. ఎగ్జామినర్‌గారి నోటురాగానే ఇవ్వగలమని, సమన్వయ సమావేశం త్వరలో జరుపగలమనీ అధికారులు హామీ యిచ్చారు.

**ఉలవపాడు సమితి :** సమితిశాఖ కార్యవర్గ సమావేశం 18-9-7 న సింగరాయకొండలో శ్రీ టి వెంకట సుబ్బయ్య అధ్యక్షతన జరిగింది. ప్రధానకార్యదర్శి శ్రీ మక్కెన కోటయ్య తం నివేదికలో జడ్.పి. సమస్యలు, సమితి బదిలీలు మున్నగు అంశాలు వివరించారు ప్రభుత్వంవారు ప్రాధమిక పాఠశాలల్లో పెంచిన 1.50 ఉత్తర్వ వెంటనేఉపసంహరించాలని విద్యాశాఖను డిమాండ్ చేస్తూ తీర్మానించారు.

**వింజమూరు సమితి :** సమితి ఉపాధ్యాయుల సమావేశంలో 6-8-77న నెల్లూరుజిల్లాశాఖ అధ్యక్షులు శ్రీయం. పోతురాజు ఆధ్వర్యాన యు.టి.యఫ్ అడ్‌హాక్ బాడీ ఏర్పడింది. అధ్యక్షులుగా శ్రీ షేక్ ఖాజావలి, ప్రధాన కార్యదర్శిగా శ్రీ సి.హెచ్. చంద్రమౌళి, ఉపాధ్యక్షులుగా సర్వశ్రీ యం. వెంగయ్య, షేక్ అహమ్మద్‌భాషా, ఎ. వెంకయ్య, కార్య దర్శులుగా సర్వశ్రీ ఎల్. నర్సయ్య, ఎన్. మాలకొండయ్య, ఎం. వెంకటరావుగార్లు ఎన్నికయ్యారు.

## సన్మానం

నెల్లూరు జిల్లా, బుచ్చిసమితి, సిద్దిపురం టి ఎ సెంటర్‌లో సంగం, పి యస్. ప్రాధమిక పాఠశాలలలో పనిచేస్తూ రిటైరైన శ్రీ ఆర్. పెంచలయ్యగార్కి వారిసేవల్ని ప్రస్తుతిస్తూ సన్మానం జరిగింది.

## బదిలీల చెర్లాట

